నవతెలంగాణ

నల్లగొండ

1

శనివారం | ఆగస్టు 17 2024 | www.navatelangana.com



స్తంభానికి వేలాడుతున్న వైర్లు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

పట్టణంలోని 28వ వార్డులో గల గీతామందిర్ దగ్గర గల కరెంటు స్తంభానికి వైర్లు ఉరి తాళ్లలా వేలడుతూ దర్శనమిస్తున్నాయి. ఈ వైర్లతో రోడ్డుపై ప్రయాణించే వారు, కాలనీ వాసులు ఎంతో ఇబ్బందికి గురవుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీతో ఉండే ప్రదేశమని ముఖ్యంగా చిన్న పిల్లలు సాయంకాలం వేల ఆటలాడుకుంటూ అంటారని వారికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకొని కరెంటు స్తంభాలకు కరెంటు వైర్లు వేలాడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న సీఐ ధనుంజయ్‌గౌడ్

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



కొండమల్లేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తూ శాంతి భద్రత పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అందించిన సేవలను గుర్తించి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లాలోని పరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకల్లో కలెక్టర్ సి నారాయణ రెడ్డి,ఎస్పీ శరత్ చంద్ర పవర్ చేతులు మీదుగా సీఐ ధనుంజయ గౌడ్ఉత్తమ అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు, మీడియా పాత్రికేయులు, ప్రజలు సీఐకి అభినందనలు తెలిపారు.

- రెవెన్యూ రికార్డు గదిలో ..రికార్డులు చూసుకుంటున్న ప్రయివేటు వ్యక్తులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారి
- రికార్డులు తారుమారైతే సామాన్య రైతులకు తప్పని తిప్పలు
- ఇప్పటికే పలు భూ రికార్డులు మాయం
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పలు గ్రామాల బాధిత రైతులు



తహసీల్దార్ కార్యాలయంలో... ప్రయివేటు వ్యక్తులు హల్‌చల్

మనిషికి గుండె ఎంత ముఖ్యమో.. ఒక గ్రామానికి రికార్డు అంత ముఖ్యం. అన్ని ప్రభుత్వ శాఖల్లో ముఖ్యమైన శాఖ రెవెన్యూ అయినప్పటికీ ఆ రెవెన్యూ కార్యాలయాన్ని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు భ్రష్టు పట్టిస్తున్నారు. వారు రికార్డు గదిలో రికార్డులు చూసుకుంటునాకప సంబందిత అధికారి పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తుంది.

నవతెలంగాణ-చింతపల్లి



చింతపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంగా మారిందని గతంలో ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. అయినా కార్యాలయం పరిస్థితి ఏమాత్రం మారకపోవడం బాధాకరమని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూలో కీలక పత్రాలైన భూ రికార్డులు గతంలో మాయమైనప్పటికీ మాకేం సంబంధం లేనట్లుగా తహసీల్దార్ కార్యాలయం వారు వ్యవరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిలో ప్రయివేటు వ్యక్తులు రికార్డును చూసుకుంటునానరు. (తమ రికార్డులను పరిశీలించుకుంటూ), ఏ సంవత్సరం పహాణీ తన పేరు లేకపోతే , తమ తాత పేరు తండ్రి పేర్లను , ఆ రికార్డులను తనకు అనుకూలంగా రాసుకొని, అవసరం వస్తే వేరే వారి పేర్లను కొట్టేసి పహాణీలు రాసుకున్న ఘనత చింతపల్లికి ఓ చెరగని ముద్రగా మారిందని గతంలో పలు ఆరోపణలు ఉన్నాయి. తనకిష్టం వచ్చిన కాలంలో రాస్తున్నారని తన పేరు లేకపోతే ఆ రికార్డే మాయం చేస్తున్నారని గతంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు ధ్వంసమైన ఘటనలో పలు అనుమానాలు ఉన్నప్పటికీ... ఇంతవరకు ఏ అధికారి కూడా స్పందించకపోవడం.. అప్పటి అధికారుల అలసత్వంతో భూమి రికార్డులు మాయమైపోయాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నోఏండ్లుగా పహాణీలో ఉన్నపేరును అకస్మాత్తుగా ఎలా కట్ చేస్తారని , అసలు భూమిలేని వారికి పట్టాదారు పాస్‌బుక్కులు ఎలా వచ్చాయని, భూమి దున్నేది ఒక రైతు అయితే.. పాసుబుక్కులు తీసుకొని లోన్లు తీసుకునేవారు మరో రైతు.. ఎందుకు ఇలా జరుగుతుందని, అసలు తహసీల్దార్ కార్యాలయంవారు ఏం చేస్తున్నట్లు అని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇప్పుడు సైతం భూ సమస్యలతో భూమి వివాదాలతో మండల పరిస్థితి అగమ్య గోచారంగా పలు విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు అదే పరిస్థితిలోనే చింతపల్లి తహసీల్దార్ కార్యాలయం ఓ బ్రోకర్ కార్యాలయంగా మారి ప్రయివేటు వ్యక్తుల పరిధిలోకి వెళ్లిపోయిందని పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. సాక్షాత్తు, వీడియో , ఫొటులు ఉన్నా ఆ వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

పేరుకు పెద్ద సామాజిక వేత్త, కుమారుడు చేసేది మాత్రం ప్రతినిత్యం పంచాయితీలో మెరిసిపోతాడు. చింతపల్లి మండలం మొత్తం వామ్మో ఇతనా.. అనే విధంగా భయభ్రాంతులకు గురి చేస్తాడని పలు విమర్శలు ఉన్నప్పటికీ అసలు తహసీల్దార్ కార్యాలయం వారు అసలు ఎందుకు అతనిపై చర్య తీసుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్ చెప్పినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదు
కూన వెంకటయ్య , ఉమాపురం



నా యొక్క భూమి ఉమాపురం గ్రామంలో సర్వే 68లో నాలుగు ఎకరాల 16 గుంటలు ఉంది. నా అవసరాల నిమిత్తం కోసం మా భార్య పేరు మీద రెండు ఎకరాలు భూమి రిజిస్ట్రేషన్ చేద్దామని స్లాట్ బుక్ చేశాను. ఆ సర్వే నెంబర్లో భూమి ఎక్కువగా ఉందని రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఓకే నెంబర్ లో 60 మంది రైతులు ఉన్నారని భూమి లేని వారికి కూడా భూమి ఉన్నట్లు రికార్డులో పొందుపరచారని, భూమిలేని వారికి కూడా పాస్ బుక్కులు వచ్చాయని సర్వే వెల్లడించగా తహసీల్దార్‌కు మాత్రం కనికరం లేకపోయింది. డబ్బులు ఇస్తే ఎంతటి పని అయినా చేసి పెద్తారు. తక్షణమే తహసీల్దార్ కార్యాలయంలో ప్రయివేటు వ్యక్తులను తీసివేసి,నిజమైన రైతులకు న్యాయం చేయాలి. నా యొక్క భూమి సర్వే చేయించి,నా పేరు మీద ఉన్న భూమిని నా భార్య పేరు మీద చేయించాలి.

రికార్డు అడిగితే ఇవ్వడంలేదు
గాదరి జంగయ్య,కుర్మేదు రైతు



రికార్డు 1955 నుంచి,2015 వరకు మ్యానువల్ రికార్డు ఉన్నప్పటికీ పహాణీలో కొట్టివేతలు చేసి, అసలు పాత రికార్డు దొరకకుండా చేస్తున్నారు. ఒకవేళ భూ వివాదంలో కోర్టుకు వెళ్దామంటే పహాణీలు కావాలని అడిగితే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల లభ్యం కావడం లేదని రాసి ఇచ్చి సంతకం పెడుతున్నారు. దీనివల్ల సామాన్య రైతులు ఎంతోమంది నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పహాణీల పేరుతో రికార్డుల పేరుతో డబ్బులు తీసుకుంటున్నారు. ఈ విషయంపై ఉన్నాతాధికారులు స్పందించి సంబంధిత అధికారుల పై చర్య తీసుకోవాలి.

ప్రయివేటు వ్యక్తులకు చోటులేదు
తహసీల్దార్ వి.విజయ్ కుమార్



తహసీల్దార్ కార్యాలయంలో ప్రవేటు వ్యక్తులకు చోటు లేదు. ప్రయివేటు వ్యక్తులు రికార్డ్ గదిలోకి వెళ్తున్నారన్న సమాచారం నాకు తెలవదు. ప్రవేట్ వ్యక్తులు రికార్డు గదిలోకి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి

- రైతులను రుణ విముక్తి చేసాం
- నియోజకవర్గంలో రూ .11.50 కోట్ల ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులతో రోడ్ల వెడల్పు, సెంటర్ లైటింగ్
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే బాలు నాయక్

నవతెలంగాణ-దేవరకొండ

నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల లో భాగంగా 3వ విడతల్లో 2 లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని విడతలవారీగా చేయడం వల్ల వడ్డీలకే సరిపోయిందన్నారు. రుణమాఫీ పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొద్ది మందకి రుణమాఫీ కాకపోవచ్చు, రుణమాఫీ నియమ నిబంధనలను సులభతరం చేసి ప్రత్యేక సర్వే నిర్వహించి రైతులందరినీ రుణ విముక్తి చేస్తామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు మాటమీద నిలబడడం లేదని ,దమ్ముంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తప్పించుకోవడానికి తప్పుడు ప్రచారం చేయడం కాదు సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలన్నారు. త్వరలో రైతు భరోసా అందజేయనున్నట్లు తెలిపారు. భూములేని రైతులకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎస్ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ పనులను వచ్చే మూడేండ్లలో పూర్తి చేసి సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన 5 లిఫ్టులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా చిత్రియాల, గాజుబేడ, నేరేడు గోము లిఫ్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖ మంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు ప్రభుత్వం ఆర్టీసీకి రూ .2100 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు.

రూ.11.50 కోట్లతో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

రోడ్లు భవనాల శాఖ ఎస్సీ ,ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.11.50 కోట్లతో డిండి, నేరేడు గోము, చందంపేట మండలంలో రోడ్డు వెడల్పు ,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ. 3 కోట్లతో డిండి మండల కేంద్రంలో రాజీవ్ విగ్రహం నుండి వ్యవసాయ క్షేత్రం వరకు డబల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేరినట్లు తెలిపారు. నేరేడు గోమ్ము మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో, కోటి రూపాయలతో పెద్ద మానే గూడెం, చందంపేట మండలం చిత్రియాలలో రూ. 3 కోట్లతో, కోరుట్ల గ్రామంలో రూ. 2.50 కోట్లు తో డబల్ రోడ్లు ,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తండాలకు ,గూడేలకు బిటి రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు . అనంతరం దేవరకొండ, నేరేడు గోమ్ము మండలంలోని 142 మంది లబ్దిదారులకు 42 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ ఆలంపల్లి నరసింహ, వైస్ చైర్మెన్ రహత్ అలీ, పీఏసీఎస్ చైర్మెన్ జాలే నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ నల్లగాసు జాను యాదవ్ ,ముత్యాల సర్వయ్య, తేరా సత్యనారాయణరెడ్డి ,మాజీ జెడ్పీటీసీ మారుపాకుల అరుణ సురేష్ గౌడ్ ,లోకసాని శ్రీధర్ రెడ్డి, యూనుస్ ,ముక్క మాల వెంకటయ్య గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మెన్ వడ్త్యా దేవేందర్ నాయక్, సిరందాసు కృష్ణయ్య ,ఏర్పుల గోవిందు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు



హరీశ్ రావుపై సీఎం వ్యాఖ్యలు సిగ్గు చేటు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



రుణ మాఫీ విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావును ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి లోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాల కోరు అని, రైతులనే కాదు దేవుళ్లను కూడా మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఆగష్టు 15 నాటికి రాష్ట్రంలోని రైతులకు రూ.31 వేలకోట్ల రుణమాఫీ చేస్తామని ఉదరగొట్టి అందులో రూ.9 వేల కోట్లు కోత పెట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని అన్నారు . అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ పుట్టినరోజు కానుకగా డిసెంబర్9 నాటికి రూ.40 వేల కోట్లు రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పింది రేవంత్ రెడ్డి నని, అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపారని ఆగష్టు 15 వరకు రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తానని అన్నారని వెల్లడించారు అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల సమయానికి రూ.9 వేల కోట్లను కోత పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని అన్నారు.రైతులందరికీ రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానని హరీశ్ రావు స్పీకర్ రాసిన లేఖలో స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు రైతులకు అరకొర రుణమాఫీ చేసి అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు 2 లక్షల రుణమాఫీ చేయాలని, లేకుంటే రేవంత్ కు దేవుళ్ళు, ప్రజలు, రైతులు తగిన శాస్త్రి చేస్తారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మేకల రాజిరెడ్డి ,యానాల అశోక్ రెడ్డి ,శ్రీధర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపి మాట్లాడారు. తమకు వస్తున్న అరకొర జీతాలు సరిపోవడం లేదని, గ్రామపంచాయతీల్లోని సమస్యలను పరిష్కరించడానికి అప్పులు తీసుకొచ్చి మరీ పనులు చేపడుతున్నామని తెలిపారు.. గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పంచాయతీ ట్రాక్టర్ మెయింటెనెన్స్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు తమపై పనిభారాన్ని పెంచుతూ మానసికంగా మనోవేధనకు గురి చేస్తున్నారన్నారు. మెమోలు, సస్పెన్షన్లతో కార్యదర్శులను మానసికంగా వేదిస్తున్నారన్నారు. ఐలాపురం కార్యదర్శి సంధ్యారాణిపై కొందరు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, భవాని, యాదగిరి, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ గా తరి రాము బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పెద్దవూర



నల్గొండ జిల్లా పెద్దవూర మండల ఎంఈఓ గా తరి రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.గత ఐదేళ్లుగా మండలంలో పర్మినెంట్ ఎంఈఓ లేక ఇన్‌చార్జిలే పర్యవేక్షణ చేశారు. ఇంతకు ముందున్న ఎంఈఓ బాలు నాయక్ పెద్దవూర ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ఎంఈఓ తరి రాము పీఏపల్లి, గుర్రంపూడ్, తిరుమలగిరి సాగర్, మండలాలకు ఇన్‌చార్జి వ్యవహరించారు. ఇప్పుడు పెద్దవూర పర్మినెంట్ ఎంఈఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానన్నారు. అదేవిధంగా మండలంలోని ఉపాధ్యాయులు ,విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. అనంతరం ఉపాధ్యాయులు,విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓ ను సన్మానించారు.

అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఫీవర్ సర్వే

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో అంగన్వాడీలు వైద్య సిబ్బందితో కలిసి 50 ఇండ్ల చొప్పున ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారని ఎంపీడీవో ఎస్ పి.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ఎమ్మెల్యే వర్సెస్ చైర్మెన్

- మిర్యాలగూడలో కాంగ్రెస్‌లో లోపించిన సఖ్యత

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, మున్సిపల్ చైర్మన్ తిరునగరి భార్గవ్ మధ్య సఖ్యత కొరవడుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వం గానీ 5, 10లక్షల రూపాయల పనులు చేసిన శిలాఫలకాలను ఏర్పాటు చేస్తారు. అయితే మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపు రాజీవ్ స్టేడియంలో వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అయితే శిలాఫలకం పెట్టేందుకు దిమ్మె నిర్మించారు. శిలాఫలకాన్ని ఏర్పాటులో విభేదాలు తలెత్తడంతో మొండి దిమ్మె మాత్రం దర్శనమివ్వడంతో సయోధ్య లేని కారణంగా పెట్ట లేదని తెలిసింది. అదేవిధంగా ఆవిష్కరణ వరకు ఉన్న చైర్మన్ భార్గవ్ సభా వేదికపై పిలవక పోవడం ఆయన వెళ్లి పోయిన అనంతరం పిలవడం రాజకీయమేనని, ప్రతీకార చర్యలు అని పలువురు అనుకుంటున్నారు.

న్యాయం కోసం జూనియర్ డాక్టర్ల ర్యాలీ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



పశ్చిమ బెంగాల్ రాజధాని కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ను ఖండిస్తూ దేశవ్యాప్త జూడాల నిరసనలో భాగంగా శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైకులపై కలెక్టరేట్ కు ర్యాలీగా వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ లైంగికదాడి , హత్య చేసిన నిందితులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు అధికారులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలు అసంపూర్తిగా ఉన్నాయని, విధుల నిర్వహణలో (షిఫ్ట్ ప్రాబ్లమ్స్) డాక్టర్లు, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర విభాగాలైన ఐసీయూ, ఎం సి హెచ్ వంటి ప్రాంతాలలో సెక్యూరిటీని నియమించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సురక్షితమైన డ్యూటీ రూములను ఏర్పాటు చేయటం తో పాటు, సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా క్యాజువాలిటీలో సింగిల్ వాష్ రూమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జీఎంసి నల్లగొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ కే అబ్దుల్ సమద్, డాక్టర్ జనరల్ కార్యదర్శి గగన్, డాక్టర్ సత్య సాయి కృష్ణ, డాక్టర్ బాలు, డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్ షాబాజ్, డాక్టర్ హిమాన్షి, డాక్టర్ ఆశ్లేషవల్లి,డాక్టర్ సంప్రీత్, డాక్టర్ హసన్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ రాష్ట్రంలో మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి రాగానే రైతులందరికి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేడు రాష్ట్రంలో 50 శాతం మంది రైతులకు పలురకాల సాకులతో రుణమాఫీ చేయలేదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అసత్య ప్రచారాలతో కాలయాపన చేస్తున్నారని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు మరో 420 హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతి దానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, ఇది సముచితం కాదని హితవు పలికారు. రాష్ట్రంలో రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీతోపాటు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చితే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారని, ఇప్పటికీ ఆయన అదే మాట మీద ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో రైతులందరికి రుణమాఫీ చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కాలం దాటినా హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని కోరారు. రాష్ట్రంలో 82లక్షల మంది రైతులకు రూ.81వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.17,900 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, రైతులందరికి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటిమాటికి బీఆర్ఎస్ పార్టీని బొందపెడ్తానని అనడం ఆయన స్థాయికి మించి మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక పేరున్న జాతీయ పార్టీ అని రేవంత్‌రెడ్డి లాంటి వ్యక్తికి సీఎం పదవి ఇచ్చి కాంగ్రెస్ పార్టీ స్థాయిని తగ్గించుకుందేమోనని అనిపిస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరితోపాటు తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ సీట్లు ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక కార్పోరేటర్ మాత్రమే గెలిచారని, గతంలో హుజూరాబాద్, మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదన్నారు. ఇవన్నీ రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలేనని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి ఆయన స్థాయిని మరిచి కేసీఆర్ లాంటి గొప్ప వ్యక్తిని విమర్శించడం తగదన్నారు. ఇప్పటికైనా మాయమాటలు చెప్పడం మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎండి. షోయబ్, ఫయాజ్, వినోద్‌నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన సిలువేరు ప్రభాకర్

నవతెలంగాణ-నకిరేకల్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్‌టీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలివేరు ప్రభాకర్ శుక్రవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. వాటిని పరిష్కరించే విధంగా చూడాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
2
శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సీతయ్య

నవతెలంగాణ-తుంగతుర్తి

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, సగం మంది రైతులకే రుణమాఫీ చేసిందని తుంగతుర్తి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. 42 వేల మంది రైతులకు 31 లక్షల కోట్లు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం, నేడు మూడు విడతల్లో రుణమాఫీ 22 వేల మంది రైతులకు 19 వేల కోట్లు మాత్రమే చేసిందని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని అన్నారు. ఏ ఒక్క వర్గాన్ని వదలకుండా వృద్ధులు మహిళలు యువకులు,విద్యార్థులు ఉద్యోగులు నిరుద్యోగులు రైతులను అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం అభినందనీయం

నవతెలంగాణ-కోదాదరూరల్



మున్సిపల్ ఉద్యోగులు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు పొందడం అభినందనీయమని మాజీ సర్పంచ్ ఎర్నేని బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో మున్సిపాలిటి నుండి ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన శానిటరీ ఇన్స్‌పెక్టర్ పి యాదగిరి, బిల్ కలెక్టర్లు టి శివప్రసాద్, రంగాచారి అనంతలక్ష్మి స్వీపర్ హెూమ నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్ మహబూబ్ పాషాలను అభినందించి మాట్లాడారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావేళ్ళ కృష్ణారావు, పారా వెంకటేశ్వర్లు, వంటిపులి రమా శ్రీనివాస్ ,నెమ్మది దేవమణి ఖాజా మైనోద్దీన్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు బిక్కి పుల్లయ్య

- నేడు చిల్పకుంట్ల గ్రామంలో సంతాప సభ

చిల్పకుంట్ల గ్రామం ఉద్యమాల కేంద్రం, ఎర్రజెండాకు పుట్టినిల్లు. సూర్యాపేట జిల్లా నూతనకల్లు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రని పూదోట చిల్పకుంట్ల. ఇప్పటికీ ఆ గ్రామం పేరు చెప్పితేనే ఎర్రజెండా అభిమానులకు ఉత్తేజం ఉరకలు వేస్తుంది. మూడు తరాలకు కూడ చెక్కు చెదరని విప్లవ కేంద్రం. నేటికి ఉద్యమాలకు ఊడల మర్రిగా నీడ నిస్తుంది. ఎంతో పోరాట చరిత్ర గల ఆ గ్రామంలో గీత కార్మిక కుటుంబంలో పుట్టి ఎర్ర జెండా నీడలోనే అందరికి ఆదర్శంగా నిలబడ్డ నాయకుడే మన బిక్కిపుల్లయ్య. పెద్ద పెద్ద చదువులు ఏమీ చదవలేదు. పెద్ద నాయకుడు కూడా కాదు. కానీ దేశ రాజకీయాలను సునాయాసంగా తన చుట్టూ ఉన్న క్యాడర్‌కు విడమర్చి చెప్పగలిగే నేర్పరి పుల్లయ్య..

ఆయన 12 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు సాయుధ రైతాంగ పోరాటం ఉధృతంగా ఉధృతాలుగుతుంది. ఎర్రబాడు దొరల వందల ఎకరాల భూములు చిల్పకుంట్లతో పాటు చుట్టూరా ఉన్నాయి. ఆ ప్రాంత చిన్నసన్న కారి రైతులు భూములు దున్ని పంటలు పండించే వాళ్ళే కాని అనుభవించే వాళ్ళు కాదు. వెట్టి చాకిరీ, వెట్టి బ్రతుకులు తప్ప ఎదిరించి నిలబడే పరిస్థితులు తక్కువ. అలాంటి సందర్భం లోనే దేవుల పల్లి, భీమిరెడ్డి నర్సింహా రెడ్డి, మల్లు స్వరాజ్యం తొట్ల మల్సూర్, ఎల్కపల్లి యాదగిరి లాంటి వారు సంఘం పెట్టి ప్రజలకు అండగా ఉన్న పరిస్థితుల ప్రభావం బిక్కి పుల్లయ్య మీద పడింది.. అనాటి నుండీ చనిపోయేంత వరకు నిజాయితీగా, నిబద్ధత గల సీపీఎం సీనియర్ నాయకుడు గా, ఆదర్శలకు నిలబడ్డా అరుదైన నాయకుడు. 50 ఏండ్ల నుండికూడ ఘర్షణలు లేని రోజూ లేదు. అన్నీ పార్టీలు ఒక్కటైతాయి. సీపీఐ(ఎం)ని లేకుండా చేయాలనే పన్నాగం, కుట్రలు, కుతంత్రాలు ఉంటాయి. ఎంఎల్ పార్టీ ముసుగులో ఉన్న ఉగ్రవాదులు అధికారములోకి ఏ పార్టీ ఉంటే ఆ పార్టీని అండ చూసుకుని ఊగి పోతుంటారు. కయ్యానికి కాలు దువ్వు తుంటారు. ఒక్కటా రెండా వందల ఘర్షణలు తుపాకులు, బాంబులు చూపి బెదిరింపులు. కానీ ఎలాంటి బెదిరింపులకు భయపడని ఉక్కు క్రమ శిక్షణ గల యువతకు ప్రేరణ మన పుల్లయ్య. 16 కేసులు, వందల దాడులు, పట్టు వదలని విక్రార్కుడిలా క్యాడర్‌ను కాపాడిన తీరు ఎందరికి ఆదర్శం. పార్టీ కుటుంబాల నుండీ వందల సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు.. తన ఇంటి నుండే ఇద్దరు పోలిస్ అధికారులు, ఉద్యోగులమని, పార్టీతో, ప్రజలతో, ఆ ఊరుతో మాకు ఏమీ సంబంధం లేదని ఎన్నడూ వారు దూరంగా లేరు ఇప్పటికీ ఎవ్వరికి కష్ట మొచ్చినా వారికి అన్నీ రకాలుగా అండగా ఉంటారు ఇదంతా కూడా పుల్లయ్య గారితో పాటు ఆ గ్రామంలోని నాయకత్వం ప్రోత్సాహం, ఇచ్చిన ఉద్యమ స్ఫూర్తి అంటారు. అలాంటి పుల్లయ్య 08 ఆగస్టు 2024 నాడు మన నుండీ భౌతికంగా దూర మయ్యారు. ఆ సందర్భంగా జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్న ఆ జనాన్ని గ్రామ స్థాయిలో ఇప్పట్లో నేను చూడలేదు.



నిత్యం శత్రువుల దాడులనుండి క్యాడర్‌ను కాపాడుకున్న ధీశాలి

1969 లో పార్టీ ఉగ్రవాదుల శీలికతో పార్టీ నష్ట పోయిన సందర్భంగానాటి నుండి నేటి వరకు సహచరులు గా ఉన్న పేదింటి జాని రెడ్డి, కొత్తపల్లి వెంకట రెడ్డి, బత్తుల లింగయ్య, బిక్కి నర్సయ్య, బత్తుల మల్ల య్య, కూసు జీడయ్య, సామ నారాయణ రెడ్డిలు కలిసి తొట్ల మాల్సూర్ డైరెక్షన్ లో ఊరుతో పాటు చుట్టూరా పార్టీని నిలబెట్టారు...

1989లో పంచాయతీ ఎన్నికల్లో ఎంఎల్ పార్టీ చేతిలో ఓడిపోయాము. గెలిచిన గర్వంతో దాడులు చేసే ప్లాన్‌లో ఉగ్ర వాదులు ఉన్నారు. పరకటీయ బండపై పార్టీ కార్యకర్తలు రక్షణ కొరకు అందరు ఓకే దగ్గరా ఉన్నారు. ఎంఎల్ పార్టీ అరాచకులు చుట్టూ ప్రక్కన గ్రామాల నుండి వందల సంఖ్యలో వచ్చి బాంబులతో దాడి చేసినప్పుడు ఎలాంటి ప్రమాదం జగరకుండా కార్యకర్తలకు రక్షణ కలిపించిందంట్లో పుల్లయ్య పాత్ర మరువలేనిది.

ఎలకపల్లి గ్రామం లో కాంగ్రెస్ గుండాలు అధికార మధం తో రైతులకు న్యాయంగా దక్కాల్సిన ఎరువుల బస్తాలు లూటీ చేసి బ్లాక్ మార్కెట్ లో అధిక ధరలకు అమ్ముకుంటుంటే రైతులకు అండగా అక్రమాలను అడ్డు కున్న సందర్భం లో కాంగ్రెస్ దాడులు, అక్రమ కేసులు ఎదుర్కున్నారు..

తప్పుకు తలవంచని నిజాయతీ గల నాయకుడు

గ్రామంలో ఎవరికి కుటుంబ సమస్యలు వచ్చినా, భూ సమస్యలతో పార్టీలకు అతీతంగా ఎవ్వరు వచ్చినా నిర్మొహ మాటంగా న్యాయం వైపు నిలబడే నాయకుడూ పుల్లయ్య. పార్టీలో గ్రామానికీ చెందిన నాయకులు నిర్మాణ పరమైన తప్పులు చేసినా అర్థిక అరాచకత్వాని పాల్పడినా చివరికి కుటుంబ సభ్యుడైన నిలదీసి నిలబెట్టినా నాయకుడు పుల్లయ్య .. గ్రామం లో శత్రువులు సహితం పుల్లయ్య పద్ధతి, నీతి నిజాయితీ చూసి ఎదురు చెప్పక పోయేది.. నిత్యం పుల్లయ్య ఇల్లు సమస్యల పరిష్కారం కోసం వచ్చి పోయే వారితో నిండుగాఉండేది.. ఏంతో బాధ తో వచ్చే వారు సహితం అయన చెప్పిన మాటలు వినీ సంతోషంతో వెళ్ళే వారు.

1995లో గ్రామంలో చిన్న పాటి ఘర్షణ జరిగింది. ఆ సందర్భంగా పార్టీ క్యాడర్ ఊరు బయట ఉన్న యాగ్రాండ్ల బావి దగ్గర సమావేశం అయ్యారు...అదే అదును గా భావించి పార్టీ నాయకులపై ఎంఎల్ పార్టీ దాడులకు పాల్పడింది. శత్రువులను తిప్పి కొట్టినప్పుడు తన పెద్ద కొడుకు గురవయ్య తో పాటు కంధాల క్రిష్టా రెడ్డి లకు గాయ పడ్డారు.. మరికొందరు గాయ పడ్డారు. రోజుల తరబడి హాస్పిటల్ ఉన్నారు. వైద్యం అందించి కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలబెట్టిన వారిలో పుల్లయ్య ముందు ఉన్నాడు.

చెదరని యువతే పార్టీకి పట్టుగొమ్మలు

భారీ ఫిరంగులు మోగినా బాంబుల వర్షం కుర్సినా .. ఎత్తిన జెండ దించమోయి సీపీఎం కి జై జై అంటూ. ఉగ్రవాదుల తుపాకి, బాంబుల మోతలకు యువత ఎన్నడూ భయపడలేదు. ఎన్నీ కేసులు వచ్చినా ఎన్ని నిర్బంధాలు వచ్చినా చెక్కు చెదరని యువకులే సీపీఎం కు బలం.

బంధువులందర్ని కమ్యూనిస్టులు గా నిలబెట్టారు

పుల్లయ్యది పెద్ద కుటుంబం. ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలతో నలుగురు అక్క చెల్లెళ్ళు. వీళ్ళందరూ చుట్టూరా ఉన్న ఎల్కాపల్లి, సింగారం, గోరంట్ల, నూతన కల్లు, ఎర్ర బాడు, గ్రామంలో ఉన్నారు... ఎర్రబాడు గ్రామం జెన్నారెడ్డి సుధీర్ రెడ్డి వందల ఎకరాల భూములు, వందలాది గ్రామాలను గుపెట్లో పెట్టుకున్న భూస్వామి ఉన్న గ్రామం... ఆ గ్రామంలో ఎంఎల్ఏ ఎన్నికల సందర్భంగా సీపీఎం ఎజెంట్ లేకుండా చేయాలనీ దొరల బెదిరింపులు... ఎలాగైనా ఎజెంట్ ను పెట్టాలని పార్టీ నిర్ణయం...దానికి పుల్లయ్య మాత్రమే చేయగలడు అని చివరకి తన తో బుట్టువు (చెల్లెలు) భర్తను ఎజెంట్ గా నిలిపి పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను సాటినాడు...

తన చిన్న కుమారునికి ఓంకార్ అని పేరు పెట్టిన తీరు

తాను నలభై ఏళ్ల కిందట తన వ్యవసాయ బావిలో జారి పడ్డారు.. కాళ్ళు, చేతులకు తీవ్రమైన గాయాలు అయ్యాయి... చనిపోయే పరిస్థితి... ఆ పరిస్థితి లో బావి నుండీ ఇప్పుడు పార్టీ నాయకుడు గా ఉన్న కందాల శంకర్ రెడ్డి బయటికి తీసారు... పార్టీ అదేశాను సారం హైద్రాబాదు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా... మన పార్టీ నుండి వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే గా మద్ది కాయల ఓంకార్ ఉండే... ఓంకార్ ప్రతి రోజు డాక్టర్లను స్వయంగా కలసి సరైన వైద్యం అందే విధంగా కృషి చేయడం వల్లనే నేను బ్రతికి తిరిగీ ఇంటికీ చెరుకున్నాని కృతజ్ఞత తో తన చిన్న కుమారుడి పేరు ఓంకార్ అని పెట్టారు.. ఇప్పుడు అతను (ఓంకార్)ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నారు..

పుల్లయ్య ఆశయ సాధనలో పయనిద్దాం

బిక్కి పుల్లయ్య మరణం కుటుంభానికి మాత్రమే కాదు... పార్టికి తో పాటు ఆ గ్రామానికీ చుట్టూరా పేద ప్రజలకు కూడ తీరని లోటూ.. అయన లేని లోటు పూడ్చలేనిది... అయన చూపించిన మార్గం, వారు ఇచ్చిన దైర్యం, వారు నింపిన చైతన్యం తో ముందుకు నడవాలి.. అప్పుడే వారికి నిజమైనా జోహార్లు, శ్రద్దాంజలి.



సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు
నెమ్మాది వెంకటేశ్వర్లు 9848720533



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ శ్రీనివాస్ నాయక్

నవతెలంగాణ-నూతనకల్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల అనుసారం డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దనీ తెలిపారు. సైబర్ మోసాలపై1930 టోల్ ఫ్రీ నంబర్‌కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేంద్రనాథ్ పాఠశాల కరస్పాండెంట్ మారగని వెంకట్ గౌడ్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, క్రిష్ణ,చారి, నాగర్జున ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపుతో.. సిబ్బందికి హాజరు నమోదు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



కలెక్టరేట్ సిబ్బంది అందరూ ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు అమలు పర్చాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ముఖ గుర్తింపు హాజరు పరికరం ద్వారా హాజరుని నమోదు చేసుకొని, పరికరం పని చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

నవతెలంగాణ-తుంగతుర్తి



మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో శుక్రవారం ఒక ఎస్సీ ఎస్టీ కేసు పై డిఎస్పి రవికుమార్ విచారణ చేశారు.ఎస్సై ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం మానాపురం గ్రామానికి చెందిన లకావత్ సురేష్ గత నాలుగు సంవత్సరాలుగా రావులపల్లి శివారులోని విజయ్‌కుమార్ యొక్క వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నాడు. అట్టి భూమిని విజయ్ కి అమ్మిన వ్యక్తులైన గట్టు సోమయ్య, గట్టు శ్రీకాంత్‌లు ఈ నెల 4న లకావత్ సురేష్ కౌలుకు చేస్తున్న భూమిలోకి ప్రవేశించి కులం పేరుతో దూషించడంతోపాటు సాగు చేసిన పత్తి పంటను ధ్వంసం చేశారని తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. దీంతో కేసు విచారణ నిమిత్తం డి.ఎస్.పి రవికుమార్ గ్రామంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పుస్తక ప్రదర్శనలో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-కోదాదరూరల్



పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన నవతెలంగాణ పుస్తక ప్రదర్శనశాలలో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పాల్గొన్నారు. బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులు గరిడేపల్లి రమేష్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనశాలలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, పుస్తక ప్రదర్శనశాల విద్యార్థులకు ఒక విద్యాబాండాగారం అన్నారు. పట్టణంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ఇలాంటి పుస్తక ప్రదర్శనశాలను తిలకించాలని పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ పుస్తక ప్రదర్శనశాల జిల్లా బ్రాంచ్ ఇంచార్జ్ గద్దపాటి రఘువరన్, బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-చివ్వెంల

దోమలు, నీటి ద్వారా ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ అప్పారావు అన్నారు. మండలంలోని అక్కలదేవి గూడెం, చివ్వెంల గ్రామపంచాయతీలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఫీవర్ సర్వే ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలకు ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. దోమల ద్వారా, ఇండ్లలో, వీదులల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్, ఎంపీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శులు మల్లయ్య విక్రమ్, ఆశా కార్యకర్తలు, మల్టీపర్పస్ వర్కర్స్, గ్రామ ప్రజలు ఉన్నారు.

డాక్టర్‌పై లైంగికదాడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- పీహెచ్‌సీ డాక్టర్ నాగిని, శృతి, బీజేపీ రాష్ట్రనాయకురాలు శ్రీలత డిమాండ్
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిరసన ర్యాలీ

నవతెలంగాణ-నేరేడుచర్ల



పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తాలోగల ఆర్‌జి కార్ ప్రభుత్వ వైద్యశాలలోవిధులలో ఉన్న జూనియర్ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి హతమార్చిన నరరూప రాక్షసులను తక్షణమే అరెస్టు చేసి ఉరితీయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నాగిని, శృతి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనకు నేరేడుచర్ల పట్టణంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళపై సామూహిక అత్యాచారం చేసి హతమార్చడం మానవ జాతికే కలంకమని ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని ఇటువంటివి పునరావృత్తం కాకుండా డాక్టర్లకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి శ్రీలత, సునీత, శిరీష ,రాంబాయి, నాగేంద్ర, విజయ, సుశీల పాల్గొన్నారు.

పేదలను ఇబ్బందులకు గురి చేస్తే తీవ్ర పరిణామాలు

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వేనెంబర్ 126 ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకొని జీవిస్తున్న పేదలను ఇబ్బందులకు గురిచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం లెనిన్‌నగర్‌లో గుడిసెలు వేసుకున్న వాళ్ళతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఆరు సంవత్సరాల నుండి నిలువ నీడలేని నిరుపేదలు కుడకుడ శివారు సర్వేనెంబర్ 126లో గుడిసెలేసుకొని జీవిస్తూ ఉంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేకసార్లు గుడిసెలను తీసి పేదలపైన, తమ పార్టీ నాయకులపైన అక్రమ కేసులు పెట్టారని అన్నారు. అయినా పేదలు భయపడకుండా గుడిసెలేసుకొని జీవిస్తుంటే 2022 అక్టోబర్ 10న కుడకుడ గ్రామానికి చెందిన ఒక టిఆర్ఎస్ నాయకుడు, అతని కిరాయి గుండాలు కలిసి మా మహిళపై దాడులు చేశారన్నారు. గత నాలుగైదు రోజుల నుండి గతంలో గొడవలు చేసిన వారే తిరిగి కవ్విస్తూ గొడవలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ గోకినపల్లి వేంకటేశ్వర రావు, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు సురం రేణుక, పార్టి పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్, డివిజన్ నాయకులు వీరబాబు, రాంజీ, వాజిద్, మోహన్, షారుఖ్, మోహన్, పద్మ, ఎల్లమ్మ, విజయ్, శంకర్, రవి పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రభలి ప్రజలు రోగాల బారిన పడుతున్నా. వాటిని నివారించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాల మూలంగా ప్రజలు టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేసి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. పిహెచ్‌సి సెంటర్లలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, జిల్లా పెళ్లి నరసింహారావు, దండ వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, మేకనబోయిన శేఖర్, వీరబోయిన రవి, కొప్పుల రజిత, మేకన బోయిన సైదమ్మ చిన్నపంగా నరసయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు, సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు అర్వపల్లి లింగయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరిలో బస్‌డిపో నిర్మాణం చేపట్టాలి



నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరిలో బస్‌డిపో నిర్మాణం వెంటనే చేపట్టాలని బస్సుడిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య అన్నారు. శుక్రవారం తిరుమలగిరి పట్టణ కేంద్రంలో బస్‌డిపో సాధన సమితి ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ విషయంపై గురువారం ఎమ్మెల్యే మందుల సామిల్‌కు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్ డిపో సాధన సమితి కన్వీనర్ కడెం లింగయ్య ,కొండ సోమయ్య, ఎస్ కే భాష ,ఆకుల ఎల్లయ్య వేల్పుల లింగయ్య, ఏనుగుల ఎర్రయ్య, చిలకల రమేష్, మధు రెడ్డి, అశోక్ ,కత్తి వెంకట్ రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

పేదల బియ్యం.. డీలర్లకు వరం

- లబ్ధిదారుల నుండే బియ్యం కొనుగోలు
- దళారులతో కలిసి డీలర్ల అక్రమ వ్యాపారం
- తుంగతుర్తి నియోజకవర్గంలో జోరుగా రేషన్ డీలర్ల దందా
- పట్టించుకోని రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు

నవతెలంగాణ-తిరుమలగిరి

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ప్రజాపంపిణి ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి.. రేషన్ డీలర్లు, దళారుల తో చేతులు కలిసి సొమ్ము చేసుకుంటున్నారు. దళారులు రాత్రి వేళల్లో సరిహద్దులు దాటించి లక్షలు సంపాదిస్తున్నారు.. తిరుమలగిరి మండల రేషన్ డీలర్లు ఒక గ్రూప్‌గా ఏర్పడి తమ వ్యాపారాన్ని దర్జాగా సాగిస్తున్నారు. స్థానిక తిరుమలగిరి తొండ వెలిశాల మామిడాల మాలిపురం గుండె పూరి బండ్లపల్లి జలాల్పురం అనంతారం తాటిపాముల నందపురంతో పాటు పలు గిరిజన తండాలు ఏరియాలోని రేషన్ డీలర్లు లబ్దిదారుల నుండి నేరుగా కిలో రూ.5 నుండి రూ.8 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.15 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పౌర సరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కిలో రూ.8కి కొనుగోలు..

తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండల వ్యాప్తంగా పలు గ్రామాల డీలర్లు గ్రూపుగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని రూ.5 నుంచి రూ. 8కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు కాకినాడ పోర్టుకు రూ.15 నుంచి రూ. 18లకు అధిక ధరలకు అక్రమంగా తరలిస్తున్నారు. బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు కొందరు రేషన్ డీలర్ల మద్దతు ఉండడం వల్లనే భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి



ఓ మహిళా రేషన్ డీలర్ జోరుగా దందా !

తిరుమలగిరి మండలంలోని ఓ గ్రామంలో ఓ మహిళ రేషన్ డీలర్ ఇటీవలె తన పదవీకాలం పూర్తి చేసుకున్నా ఓ ప్రజాప్రతినిధి అండదండతో తనని ఎవరూ ఏం చేయలేరు అనే ధీమాతో బియ్యందందా చేస్తూ లక్షలు సంపాదిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నోసార్లు ఆమెపై ఫిర్యాదు చేసినా పత్రికల్లో ప్రచురించినా ఆ డీలర్‌పై అధికారులు చర్యలు తీసుకోవడం విఫలమయ్యారు.

మొక్కుబడిగా తనిఖీలు.. దర్జాగా దందా

మొక్కుబడిగా, నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించడంతో అక్రమ బియ్యం దందాకు అరికట్టు లేకపోతునారు అని పెద్ద ఎత్తున ఆరోపణలు. బియ్యం దందా పట్ట పగలు ప్రధాన రహదారుల వెంట జరుగుతున్న పట్టు కోవలసిన అధికారులే ఏం పట్టనట్టు వ్యవహరించడంపై బహిరంగ ఆరోపణలు లేకపోలేదు.

ఊరి చివర ఉన్న ఇళ్లే అడ్డాలు..

అక్రమ రవాణాదారులు సిండికేటుగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని ద్విచక్రవాహనాలు, ఆటోలు, టాటాఏసీ వాహనాలల్లో బియ్యం బస్తాలను తీసుకువచ్చి పాత రైస్‌మిల్లులు, రోడ్డు సౌకర్యం ఉండి ఊరు చివరన ఉన్న ఇళ్లలో అడ్డాలుగా ఏర్పాటు చేసుకుని డంప్ చేస్తారు. భారీ మొత్తంలో జమచేసిన తర్వాత రాత్రి సమయాలల్లో టర్బో లారీల్లో కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయని ఆరోపణలు

అధికారులకు సవాల్‌గా..

పీడీఎస్ అక్రమ దందా సంబంధిత అధికారులకు సవాల్‌గా మారుతోంది. నిలువరించేందుకు అధికారులు నిఘా ఏర్పాటు చేస్తున్నప్పటికీ వారి కంట్లో పడకుండా ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ వ్యాపారి పాత ఇంటిలో 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో ఆ ఇంటిపై స్థానిక గత ఎస్సై సత్యనారాయణ గౌడ్ దాడి చేసి, బియ్యాన్ని సీజ్ చేశారు. మండలంలోని పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ అక్రమ బియ్యం దందా మాత్రం ఆగడం లేదని పలువురు తెలుపుతున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ కరువు..

ప్రజాపంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్ల దందా అడ్డు లేకుండా పోతుంది. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టకుండా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలు తీసుకువచ్చింది. అయినా కూడా వారి దందా మాత్రం ఆగడం లేదు. వేలిముద్రలు వేసి బియ్యం తీసుకోవాల్సిన వినియోగదారులు అక్కడే డీలర్ కు విక్రయిస్తున్నారు. ప్రతినెల 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్న కొంతమంది డీలర్లు వారం రోజులు మాత్రమే పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ప్రతి నెల రేషన్ షాపులకు వచ్చిన కోటా ఎంత ? వినియోగదారులు తీసుకున్నవి ఎన్ని ? మిగిలినవి ఎంత ? అనే లెక్కలు తెలుస్తున్నాయి. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం షాపులను తనిఖీ చేయడం లేదు. బియ్యం దందా చేసే వాళ్లు ఎక్కడెక్కడ ఉంటారో అధికారులకు తెలిసినప్పటికీ పెద్దగా పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ బియ్యం దందాలో దళారులు, డీలర్లు లాభాలు పొందుతున్నారు.అధికారులు తనిఖీలు చేయకపోవడం కారణంగానే రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లక్షల్లో జరుగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీల బహూకరణ

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన దొంతరబోయిన నవీన్‌కుమార్ తన పుట్టినరోజును పురస్కరించుకుని రూ.60వేల విలువైన ఏడు సిమెంట్ బెంచీలను గ్రామంలోని గ్రామపంచాయతీ సమీపంలో, ఇతర కూడలి ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిపెరిగిన ఊరి కోసం సహాయం చేయాలని ఉద్దేశంతో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాల్లో తన వంతు సహాయం అందిస్తున్నానని, అందిస్తూనే ఉంటానని తెలిపారు. ఈ



కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మీ, మాజీ సర్పంచ్ ముత్యాల సుజాత రవి, గోపాల్, చిప్పలపల్లి రవి, సాయిలు, రాంబాబు, తరుణ్, ఆవులసాయి, దొంతర బోయిన దైవాదీనం ముదిరాజ్, ఉద్యోగసంఘం కార్యదర్శి యాదగిరి, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గ మాతా ఆలయంలో అన్నదానం

నవ తెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో శుక్రవారం శ్రీ కనకదుర్గదేవి ఆలయంలో మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.ప్రత్యేకపూజలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బేతి రాములు ,ఆలయ కమిటీ చైర్మెన్ కొలుపుల హరినాథ్,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బునాదిగాని కాల్వ పనులను పూర్తిచేసి, గోదావరి జలాలు అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం

నవతెలంగాణ-మోత్కూర్

బునాదిగాని కాల్వ పనులను పూర్తి, చేసి గోదావరి జాలాలను అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం బునాదిగాని కాల్వ పనులను పూర్తిచేసి గోదావరి జలాలు అందించాలని ఆపార్టీ ఆధ్వర్యంలో రౌడ్ టేబుల్ సమావేశం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.బీబీనగర్ మండలం మక్తనాంతారం నుండి మొదలైన ఆ బునాదిగాని కాల్వ ధర్మారం వరకు దాదాపు 98 కిలోమీటర్లు, ఇప్పటి వరకు 54 కిలోమీటర్లు పూర్తయ్యిందన్నారు.ఇంకా 44 కిలోమీటర్లు కావాల్సి ఉందన్నారు. 448



ఎకరాల భూసేకరణకు ఇంకా కాల్వ పూర్తి కావడానికి ఇంకా 106 ఎకరాల భూసేకరణ కావలసిన ఉందని అన్నారు. కాల్వను త్వరగా పూర్తి చేసి, బస్వాపురం ప్రాజెక్ట్ ద్వారా అనుసంధానం చేసి, గోదావరి నీరందించాలని కోరారు.కాల్వ సాధన కోసం, వచ్చే నెల మొదటి వారంలో ధర్మారం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లుయాదగిరి, అఖిల పక్ష నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవిశెట్టి ఐల్లుమల్లు,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతుసంఘం నాయకులు పైళ్ల యాదిరెడ్డి, టౌన్ కార్యదర్శి కూరపాటిరాములు, దడిపల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య, పైళ్ల రాంరెడ్డి, కొంపల్లి గంగయ్య, కందుకూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల ఉద్యమ పిలుపునకు... లక్షలాది మంది తరలొస్తరు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కునంనేని సాంబశివరావు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలపై పోరాడేందుకు కమ్యూనిస్టులు పిలుపు నిస్తే, ఉవ్వెత్తున ఎర్రజెం డెత్తుకొని లక్షలాదిమంది తరలి వస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు అన్నారు. ఆలేరు పట్టణంలో శుక్రవారం దినేష్ గార్డెన్‌లో ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, కార్యవర్గ సభ్యుడు చెక్కా వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా సభ్యుల నిర్మాణ కమిటీ సమావేశంలో ప్రజా సమస్యలపై పలు అంశాలపై చర్చించారు. యాదాద్రి జిల్లాలో పెండింగ్లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, మండల కార్యదర్శి చౌడ బోయిన కనకయ్య, పోతు ప్రవీణ్, చౌడ బోయిన పరుశ రాములు, తెడ్డు ఆంజ నేయులు, పొన్నబోయిన రవి,బొడ్డు ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమ నాయకులపై పోలీసుల అత్యుత్సాహన్ని ఖండించండి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి



సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి కొత్తగూడెం,మహబూబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతానికి ఇవ్వాలని, ఏజెన్సీ రైతుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు పట్టణంలో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల యువజన సంఘం అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని ప్రగతిశీలయువజన సంఘం పట్టణ కార్యదర్శి పగడాల శివ డిమాండ్ చేశారు.ఈ విషయమై శుక్రవారం పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.అరెస్టయిన సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఆవునూరి మధు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి తదితరులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పోతగలనరసింహ, లక్ష్మీనారాయణ, మున్నా ప్రవీణ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హన్మాపురం గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు భువనగిరి ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి చర్చించారు.ముఖ్యంగా గ్రామంలో బోనాలపండుగ ఉన్నందున వీధి దీపాల ఏర్పాటు చేయాలని, వెంటనే దోమల మందును గ్రామంలో పిచికారి చేయాలని, ముఖ్యంగా గ్రామంలో నీటి సమస్యను తీర్చేందుకు అవసరమైన చోట నూతన గేటు వాళ్ళు ఏర్పాటు చేసి, నూతన బోరుమోటర్‌ను ఫిట్ చేయాలని,పాత బోరుబావిలోకి నూతనపైపులు మంజూరు చేయాలని కోరారు.సెక్రెటరీ సెలవులో ఉండడం, స్పెషల్ ఆఫీసర్ గ్రామానికి రాకపోవడంతో గ్రామప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడు తున్నారని గ్రామానికి నియమించిన ప్రత్యేక అధికారి గ్రామప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, సీపీఐ(ఎం) మండలకార్యదర్శి దయ్యాలనర్సింహ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు తుమ్మేటి వెంకటేష్‌యాదవ్,బీఆర్ఎస్ నాయకులు నాగపురికృష్ణ, మాజీఉపసర్పంచ్ ఏనుగు లింగారెడ్డి, మోటెఎల్లయ్య,మాజీ వార్డు సభ్యులు మోర లింగారెడ్డి, రంగస్వామి, నాయకులు హన్మగంటి రాజు, హన్మగంటి సత్యనారాయణ, ములాయంసింగ్ బ్రిగేడ్ యూత్ రాష్ట్ర అధ్యక్షులు మేకల బాలుయాదవ్, ఎస్సీసెల్ నాయకులు బండారిసుధాకర్ పాల్గొన్నారు.

మహిళలపై కేటీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్సులు,రికార్డింగ్ డాన్సులు వేసుకోవచ్చు అంటూ మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడిన కేటీఆర్ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మహిళ అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ బంద్రు శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనిషికో బస్సు పెట్టండి కుట్లు, అల్లికలు అవసరమైతే డాన్సులు,రికార్డింగ్ డాన్సులు కూడా చేసుకుంటరంటూ మహిళలను అవమానించే విధంగా మాట్లాడిన కేటీఆర్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు.పేద మహిళలు తమ జీవనోపాధి కోసం చిన్న,చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళడానికి మహిళలకు వరప్రదాయిని ఫ్రీ బస్సు అని తెలిపారు.మహిళల పట్ల మీకున్న గౌరవం ఇదేనా అంటూ కేటీఆర్ పై తీవ్రంగా మండిపడ్డారు.

పారిశుధ్య చర్యలపై ప్రత్యేకదృష్టి సారించాలి

నవతెలంగాణ-రాజపేట



వర్షాకాలం కావడంతో పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పనులు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగే అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన రాజపేట మండలం నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం డ్రైడే పనులను పరిశీలించారు. నర్సరీని చూసి ప్రైమరీ బెడ్‌లకు సంబంధించి ఖాళీగా ఉన్న సంచులలో తిరిగి మొక్కలు పెంచాలని సూచించారు. పల్లె ప్రకృతివనం మొత్తం తిరిగి చెట్లను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్‌లో గ్యాపులు ఉన్నచోట తిరిగి పెద్దమొక్కలు నాటాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌లో వర్మి కంపోస్టు తయారీని పరిశీలించారు.ఎంపీడీఓ నాగవేణి మాట్లాడుతూ తయారైన వర్మి కంపోస్టును తిరిగి నర్సరీలో, ప్లాంటేషన్ మొక్కలకు ఎరువుగా వాడుతున్నట్లు వివరించారు. నీరు నిల్వ కాకుండా చూడాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద చేపట్టిన చెరువు కూడికతీత పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కిషన్, పంచాయతీ సెక్రెటరీ పవన్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణా సర్టిఫికెట్లను శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, రాష్ట్ర ప్రభుత్వవిప్ బీర్లా



అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరై మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.నిర్వాహకులు ఆహ్వానితులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-రాజపేట



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర మహిళల పట్ల మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఓ మహిళ కేటీఆర్ దిష్టిబొమ్మను చెప్పుతో కొట్టి తన నిరసన వ్యక్తం చేశారు.ఆ పార్టీ మండలఅధ్యక్షుడు నమిల మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు, మహిళలు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నమిల మహేందర్‌గౌడ్ మాట్లాడుతూపురుషులతోపాటు మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్తుంటే ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ ను దృష్టిలో పెట్టుకొని మహిళలను అవమానపరచడం న్యాయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్యగౌడ్, రాజపేట పట్టణ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, మోత్కుపల్లి పాండవుల బస్వరాజ్, పాండవుల లక్ష్మణ్, బూత్కూరి నర్సింహారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు పెద్దోళ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎంపీ చామలకు సన్మానం

నవతెలంగాణ-రాజపేట



రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మామిడిగళ్ళ జాన్‌బాబు శుక్రవారం భువనగిరి ఎంపీ చామలకిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను సూచించాలని కోరుతూ గతంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసి ఎంపీ చామలకు కూడా వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చామల సానుకూలంగా స్పందించారన్నారు.

మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

ఎస్సీ వర్గీకరణ అమలుకు సుప్రీం కోర్టు ఆమోద ముద్ర వేసిన అనంతరం హైదరాబాద్ కు చేరుకున్న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ను శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద శంకర్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదాద్రి లడ్డూ ప్రసాదం అందజేశారు.30 ఏండ్ల పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.ఆయన్ను కలిసిన వారిలో సీనియర్ నేత బూడిద జానిమాదిగ, నాయకులు ఆకారపు లక్ష్మీనారాయణ మాదిగ, కొల్లూరి హరీష్‌మాదిగ ఉన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం

నవతెలంగాణ-ఆత్మకూరుఎం



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను శుక్రవారం హైదరాబాదులోని వారి నివాసంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామితో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మంద కృష్ణమాదిగను శాలువా ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నల్ల చంద్రస్వామి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ స్థాపించి,ఎస్సీ వర్గీకరణ అమలకు అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడబెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, సుప్రీంకోర్టు ద్వారా చట్టబద్ధంగా ఎస్సీ వర్గీకరణ ఏర్పాటు చేయాలని తీర్పు రావడంలో మంద కృష్ణమాదిగ చేసిన కృషి అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణమాదిగ,నాయకులు మందశంకర్‌మాదిగ,మీసాలనర్సింహ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

'దైవచింతనతో మానసిక ప్రశాంతత'

నవతెలంగాణ-చౌటుప్పల్

దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు.శుక్రవారం పట్టణ కేంద్రంలోని భవానీనగర్‌లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం మహిళా భక్తులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.ఈ సందర్భంగా వెన్‌రెడ్డి రాజు-సంధ్య దంపతులు వాయనం ప్రదానం చేశారు. ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం-శ్రీలత, బొబ్బిళ్ల మురళి-సంధ్య, కామిశెట్టి చంద్రశేఖర్-శ్రీదేవి, గుర్రం వెంకటేశ్-విమల, పోలోజు శ్రీనివాస్-శ్రీలత, ఉజ్జిని మంజుల, దేవరపల్లి కరుణ, మునుకుంట్ల పద్మావతి, రాజపేట శ్రీలత, ఉప్పల కుసుమ, సింగిరెడ్డి రజిత, చింతలకరుణ, విజయలక్ష్మీ, శైలజ, రమాదేవి, లక్ష్మమ్మ, సంధ్య, కీర్తన, జ్యోతి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో...

ఆలేరుటౌన్ : ఆలేరు పట్టణం, మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కొలనుపాక, శారాజుపేట, సాయిగూడెం,మందనపల్లి ,కొల్లూరు, ఇక్కుర్తి తదితర గ్రామాలలోని ప్రధానాలయాల్లో శ్రావణ రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు మహిళా భక్తులు ఘనంగా నిర్వహించారు.ఆలేరు పట్టణంలో సంతోష్‌మాత ఆలయంలో మహిళా భక్తులు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు.తూర్పుగూడెం రాజరాజేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతపూజలు ఆలయ అర్చకులు సురేష్ శ్రీ వాణి, ఐవీఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్‌చైర్మెన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, రాజన్న సేవా సమితి అధ్యక్షులు మొరం శెట్టి శ్రీనివాసు నాగరాణి గోత్రనామాలతో వ్రత పూజ నిర్వహించారు కుంకుమార్చన చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గట్టు సత్యనారాయణ, రాజేశ్వరి,సీసా జనార్దన్‌గౌడ్ ,సుశీల, దూడలరవీందర్, పద్మ,బబ్బూరి శంకర్‌గౌడ్, సబిత, అమరేందర్,గీతిక,పబ్బ మహేష్ పాల్గొన్నారు.



ఆలేరులో..

చౌటుప్పల్ అభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధే తనలక్ష్యమని మున్సిపల్‌చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు.శుక్రవారం పట్టణకేంద్రంలోని చిన్న కొండూరు రోడ్డులోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయఆవరణలో సీసీరోడ్డు నిర్మాణపనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు.చౌటుప్పల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మెన్ బొబ్బిళ్ల మురళి, వెన్‌రెడ్డి సంధ్య కామిశెట్టి చంద్రశేఖర్, పోలోజు శ్రీనివాస్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రంవెంకటేశ్, బొబ్బిళ్ల సంధ్య, సింగిరెడ్డి రజిత, పోలోజు శ్రీలత పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

మండలంలోని రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు సూదగాని అండమ్మ అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం మృతురాలు కుటుంబ సభ్యులకు బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరదీప్‌రెడ్డి సహకారంతో రూ.5వేలను ఆ పార్టీ మండల మహిళా నాయకురాలు దుంప సుజాత అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుధగాని లింగయ్య, నాయకులు ఆవుల మల్లయ్య, మెరుగుఅంజయ్య, కర్రె అయిలయ్య, బండి నరేశ్, దుంప పరుశరాములు పాల్గొన్నారు.

ఏడుపాయల వన దుర్గమ్మ దర్శనానికి వెళ్లిన రాజపేట పాడి రైతులు

నవతెలంగాణ-రాజపేట

రాజాపేట పాలఉత్పత్తిదారుల సహకార సంఘం పాడిరైతులు శుక్రవారం మెదక్‌లోని ఏడుపాయల దుర్గమ్మ దేవాలయానికి విహారయాత్రగా బయల్దేరారు.ఈ విహారయాత్రలు రైతులకు మానసిక ఉల్లాసం కలుగజేస్తుందని చైర్మెన్ సందుల భాస్కర్‌గౌడ్ అన్నారు. విహారయాత్రకు వెళ్లిన వారిలో మాజీ చైర్మెన్లు గాండ్ల నర్సింగరావు, కాకల ఉపేందర్, చలమలపల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు గుర్రం విజయలక్ష్మీ, మేక రమేశ్, సిగుళ్ళ సిద్దులు, చర్మలపల్లి నాగరాజ్, మేకమల్లేశం, ఎర్రగోకులమల్లేశం, అమ్మపురం పద్మ ఐలయ్య, కోయ యాదగిరి, రైతులు ఉన్నారు.

ఆలేరుకు గొంగిడి సునీత చేసిన సేవలు ఆదర్శనీయం

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ రాష్ట్రంలోనే ఆలేరును అభివృద్ధిలో ఎంతో తీర్చిదిద్ది ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమించిన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి సేవలు ఆదర్శనీయమని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు.శుక్రవారం మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను రాజపేటలో ఘనంగా నిర్వహించారు. గాంధీ కూడలి వద్ద భారీ కేక్‌ను కట్ చేసి సంబురాలు జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆలేరు తొలి మహిళా శాసనసభ్యురాలు తెలంగాణ ఉద్యమ రుద్రమదేవి ప్రతి అడుగు జనం కోసం ప్రతి క్షణం ప్రగతి కోసం నిస్వార్థ రాజకీయాలకు మారుపేరు ఆలేరు ముద్దుబిడ్డ గొంగిడి సునీత అని తెలిపారు.మండలంలోని బీఆర్ఎస్ కుటుంబాలలో రైతుల ఇండ్లలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో రాజపేట మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి



బొమ్మలరామారంలో..

ఘనంగా సునీతమహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్, చెడదీపు అంబబాయి, జాల మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భోగహరినాథ్, పుట్టగూడెం మాజీసర్పంచ్ దేవి రాములునాయక్, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఎర్ర గోకుల జస్వంత్, సందెల వెంకటేష్, ఆకిరెడ్డి నరసింహులు, రాజాపేట గ్రామ శాఖ అధ్యక్షులు బెడుదే వీరేశం, యువజన విభాగం మండలఅధ్యక్షులు పల్లెసంతోష్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి కరీం, మహేంద్ర యువసేన మండల అధ్యక్షుడు బిళ్ళకుదురు రాజు, మెలుగు సోమలింగం, గజ్జలరాజు లక్ష్మణ్‌నాయక్,మోత్కుపల్లి బాలకృష్ణ,వరిమడ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండల అధ్యక్షుడు పోలగొని వెంకటేశ్‌గౌడ్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ సుధీర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ గుదె బాల నర్సింహ, మాజీ వైస్‌చైర్మెన్ సత్యనారాయణ,మాజీ సర్పంచ్ గణేశ్,నవీన్‌గౌడ్, బీరప్ప, నాయకులు ఆంజనేయులు,మన్నె శ్రీధర్, బోనకూర మల్లేష్, కట్ట శ్రీకాంత్, నిరుకొండ రమేష్, జూపల్లి భరత్, రామకృష్ణ, పెద్దలు, రాజు యాదవ్, ఉపేందర్, బండి మహేష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందరెడ్డి పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు పాదాల వద్ద అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేకును ఆమె కట్ చేశారు.అంతకుముందు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనారసింహస్వామిని కుటుంబసమేతంగా ఆమె దర్శించుకున్నారు.ఆమెకు అర్చకులు దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రెవెంకటయ్య, మున్సిపల్ వైస్‌చైర్మెన్ మేడబోయిన కాటంరాజు, బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షుడు పాపట్ల నరహరి,మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, బీఆర్ఎస్ నాయకులు నాయకులు మిట్టవెంకటయ్య,ఆరే శ్రీధర్,ముక్కెర్ల అండాలు, ర్యాకల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలేరుటౌన్: ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆలేరు పట్టణం ఇమిడి నర్సింహారెడ్డి గార్డెన్‌ల్లో కేక్ కట్ చేసి నియోజకవర్గంలోని పలు మండలాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. మండలంలోని కొలనుపాక గ్రామం తో పాటు, పలు గ్రామాలలో మండల కేంద్రాలలో కేక్ లు కట్ చేసి పలు సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలేరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఇమ్మడి నర్సింహారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరైన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మదర్‌డెయిరీ చైర్మెన్ లింగాల శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య, ఆలేరు



యాదగిరిగుట్టలో...

పీఏసీఎస్ చైర్మెన్ మొగలగాని మల్లేశం, వైస్‌చైర్మెన్ చింతకింది చంద్రకళ మురహరి, యాదగిరిగుట్ట జెడ్పీటీసీ అనురాధ, నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి,కర్రె వెంకటయ్య, గంగుల శ్రీనివాస్, గడ్డమీద రవీందర్, బీస కృష్ణంరాజు,ఆరె మల్లేశం, పుట్ట మల్లేశం, మొరిగాడి వెంకటేష్, గాదపాక నాగరాజు, భేతి రాములు, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలేరులో...

4

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి

శనివారం | ఆగస్టు 17, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరామ్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం హైదరాబాద్ శాసన మండలిలో మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఇతర ఎమ్మెల్యేల ఓటింగ్ మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై, పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా పదవి బాధ్యతలు చేపట్టిన సం దర్భంగా శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. పూలబొకే అందజేశారు. అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-చింతపల్లి



మండల కేంద్రానికి చెందిన ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మండలంలోని గడియ గౌరారం గ్రామానికి చెందిన ప్రముఖ పత్తి వ్యాపారి వరికుప్పల వెంకట్ రాములు, మమత, దంపతుల కుమారుడు రాహుల్, కుమార్తె హనీ శ్రీ ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు చిన్నారులకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే జానీ, వి రమేష్, ఎస్ కె మున్నా, వి శివ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం పెద్దపీట వేసిందని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. మహిళలపై కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమణి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పిల్లి యాదగిరి, పుట్టా రాకేష్, మామిడి కార్తీక్,కంచర్ల ఆనంద్ రెడ్డి, జంజీరాల గిరి, పెరిక అంజయ్య

తవ్వేకొద్ది బయటపడుతున్న అక్రమాలు

- ఇంక్రిమెంట్ల పేరుతో వసూళ్లు
- పోస్టింగుల పేరుతో దావత్‌లు
- కలెక్టరేట్‌లో ఏ ఉద్యోగిని కదిలించిన బయట పడుతున్న వారి బాగోతాలు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



సూర్యాపేట కలెక్టరేట్‌లోని రెవెన్యూశాఖలోని ఓ విభాగంలో పని చేస్తున్న అధికారి, సిబ్బంది అక్రమాలు తవ్వేకొద్ది బయట పడుతున్నాయి.ఉద్యోగుల నుండి పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం చేసినట్లు సమాచారం. ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్న ఆ ఉద్యోగుల తీరుపై సిబ్బంది కలెక్టరేట్‌లో పని చేయాలంటేనే జంకుతున్నారు. దీనికితోడు ఆయన చేతిలో సుదర్శన అస్త్రం తోడు ఉండడంతో ఏ సిబ్బంది అయినా గట్టిగా అడిగితే ఆ సిబ్బందిపై చర్యలు తీసుకుంటారనే భయాందోళనలో ఉన్నారు. ఇంక్రిమెంట్లు, పోస్టింగులు, ట్రాన్స్‌ఫర్, బిల్లుల సాంక్షన్ ఇలా అన్ని ఫైల్స్ వారి చేతుల్లోనే ఉండడంతో రెవెన్యూశాఖలో వారి ఆడిందే ఆట పాడింది పాటగా నడుస్తుందని కలెక్టరేట్ లోని కొంతమంది ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఆ అవినీతి ఉద్యోగి చేతులో సుదర్శన అస్త్రం ఉండడంతో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఇంక్రిమెంట్ల పేరుతో అడ్డగోలుగా వసూళ్లు..

కలెక్టరేట్‌లో పని చేస్తున్న సిబ్బందికి రావాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వాలంటే రూ.15వేల నుండి రూ.30వేల వరకు వసూళ్లు చేయగా పోస్టింగ్ ల కొరకు రూ.20 వేల నుండి రూ.50వేల వరకు అడ్డగోలుగా వసూళ్లు చేశారని సమాచారం. అంతేకాకుండా ఇద్దరు కలిసి రెవెన్యూశాఖలోని ఉద్యోగుల పోస్టింగ్, డిప్యుటేషన్ పేర్లతో అందినకాడికి దోచుకున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగిన అంతా ఇవ్వకపోతే చాలా మంది ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు పెండింగ్ లోనే పెట్టారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బార్‌లో సెటిల్ మెంట్లు..

ఏ పని కావాలన్న కలెక్టర్ బంగ్లాకు కూత వేటు దూరంలో ఉండే ఒక బార్‌లో సదరు ఉద్యోగి సెటిల్ మెంట్ అడ్డాగా మార్చుకొని సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు అక్కడే అక్రమాలకు పాల్పడుతున్నారని విశ్వసనీయ సమాచారం. డబ్బులతో పాటూ దావత్‌ల పేరుతో అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవల ఒక అటెండర్ పోస్టింగ్ కోసం రూ.30వేలతో పాటు ఒక ఖరీదైన మద్యం బాటిల్ డిమాండ్ చేసి మరి ఇప్పించుకున్నట్లు సమాచారం.

మచ్చుకు కొన్ని..

కలెక్టరేట్‌లోని ఒక విభాగంలో పని చేస్తున్న ఒక ఉద్యోగికి రావాల్సిన ఇంక్రిమెంట్ల కోసం నెలల తరబడి పెండింగ్‌లోనే పెట్టడంతో చేసేది ఏమీ లేక రూ.20వేలు ఇచ్చుకున్నట్లు సమాచారం. ఇటీవల ఒక ఉద్యోగి అలసత్వం వహిస్తున్నాడని కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడంతో దాన్ని ఆసరాగా చేసుకుని సదరు అవినీతి అధికారి, ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీసుల పేరుతో వేధింపులకు పాల్పడుతుండడంతో రూ.30వేలు సమర్పించుకున్నాడని సమాచారం. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఒక ఉద్యోగిని కోదాడ నియోజకవర్గనికి ట్రాన్సఫర్ చేయగా డిప్యుటేషన్ కోసం రూ.15వేలు కూడా వసూళ్ళు చేశారు ఆరోపణలు ఉన్నాయి.

సాగర్ 4 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటివిడుదల

- శ్రీశైలం జలాశయం నుండి 79,535 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

నవతెలంగాణ-నాగార్జునసాగర్



ఎగువ శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది దీనితో ఎన్ఎస్పి అధికారులు 4 క్రస్ట్ గేట్లను 5అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి సాగర్ జలాశయానికి 79,535 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. గురువారం ఉదయం రెండు గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల వరద ప్రవాహం పెరగటంతో మధ్యాహ్నం మరో రెండు గేట్లను ఎత్తి మొత్తం 4 గేట్ల ద్వారానే నీటి విడుదలను కొ న సాగిస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 590 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,150 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 7518 క్యూసెక్కుల నీటిని,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, లోలేవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి మొత్తం 79,535 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రతిభాపురస్కారాలు అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారులు రవ్వ అశోక్ తన తల్లిదండ్రులైన రవ్వ సత్తమ్మ- శ్రీరాములుల జ్ఞాపకార్థం ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, విద్యా కమిటీ చైర్మెన్ నిరోషా, రిటైర్డ్ హెచ్ఎం తవుటం భిక్షపతి, సింగణబోయిన జంగయ్య, శివగల్ల నర్సింహా, డాక్టర్ పున్న రామేశ్వరం, రవ్వ చంద్రమోహన్, రవ్వ నర్సింహ, కడారి నరేందర్, నిర్మల మేరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే

నవతెలంగాణ-మునుగోడు



మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే అని వెదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మేఘ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ వెదిరే విజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని కొంపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన శిఖరాన్ని చేరుకునేందుకు పట్టుదలతో లక్ష్యాన్నిపెట్టుకొని చదివితే విజయ్ సాధించవచ్చని సూచించారు. పాఠశాలలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు క్రీడలపై పట్టు పెంచేందుకు 40 మంది విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా దుస్తుల కోసం రూ.30 వేల నగదును పాఠశాలకు అందజేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు విషయం తెలవడంతో వెంటనే స్పందించి సొంత ఖర్చులతో ఉపాధ్యాయులను ఏర్పాటు కోసం కృషి చేశారు. పాఠశాలలో తమ తల్లి జ్ఞాపకార్థంగా స్టేజి నిర్మాణం చేపిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వేదిరే పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సమస్యను పరిష్కరించి అండగా ఉంటామని తెలిపారు . గ్రామంలో వేదిరే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టే సేవలకు గ్రామంలోని ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, పాఠశాల చైర్మన్ జీడిమడ్ల యాదయ్య, గ్రామ సభ్యులు వడ్లమూడి హనుమయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కాపాడుకోవడం కోసమే బీఆర్ఎస్ నేతలు విమర్శలు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



ఉనికి కాపాడుకోవడం కోసమే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని,కాంగ్రెస్ రుణమాఫీతో దేశ రైతుల చూపు తెలంగాణ వైపే ఉందని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి తెలంగాణ రైతులకు సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. ముఖ్యమంత్రి రైతు బాంధవుడని, ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన చరిత్ర ఆయనకే దక్కిందన్నారు.సాంకేతికకారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని,రుణమాఫీ అయి తీరుతుందన్నారు. తెలంగాణ రైతుల పక్షాన నిలబడ్డ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలన్నారు.బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.73 వేల కోట్లు కేటాయించి రైతులకు సీఎం పెద్దపీట వేశారన్నారు.రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని,పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 8 వేల కోట్లను రుణమాఫీ చేయకుండా ఎగనామం పెట్టిందన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని రుణమాఫీ పైన హరీష్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీష్‌రావు.. మాట మీద నిలబడి రాజీనామా చేయాలని లేకపోతే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి అమరవీరులస్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలన్నారు.నీ మెదడు నెత్తిలో ఉందా..? లేక మోకాలులో ఉందా అని ప్రశ్నించారు.తెలంగాణ మహిళలను కించపర్చేలా కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు.అధికారమదంతో మహిళలపైన అగౌరవంగా మాట్లాడాడని కాంగ్రెస్‌కు మహిళలు ఓట్లు వేసి అక్కసుతోనే విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు.నైజాం మీద తుపాకీ ఎక్కుపెట్టి పోరాడిన చరిత్ర తెలంగాణ మహిళలదన్నారు.సమ్మక్క సారలమ్మ, చాకలి అయిలమ్మ, మల్లుస్వరాజ్యం తెలంగాణ వారేనన్నది మరిచిపోవద్దన్నారు. తెలంగాణ మహిళలకు క్షమాపణ చెప్పకపోతే చీపురు కట్టలతో బుద్ధి చెపుతారన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలు ప్రయాణిస్తూ వారి పని వారు చేసుకుంటే నీకేం బాధ అవుతుందన్నారు. రాఖీ కట్టడం కోసం సంతోషంగా ఆర్టీసీ బస్సులో మహిళలు ప్రయాణం చేస్తుంటే ఓర్వలేకపోతున్నారన్నారు కేసీఆర్ బయటకు రాడు.. ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించడని, స్పీకర్‌ను మైక్ అడగాల్సి వస్తుందన్న అక్కసుతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు.కేటీఆర్ విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేశాడని కానీ మా సీఎం పెట్టుబడులు తెచ్చారన్నారు. ప్రపంచంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచాలని మా ముఖ్యమంత్రి చూస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతల ముఖ్యమంత్రి అన్నారు.

వికలాంగులకు హామీ ఇచ్చిన పెన్షన్ను తక్షణమే పంపిణీ చేయాలి

నవతెలంగాణ-హాలియా



కాంగ్రెస్ ప్రభుత్వము వికలాంగులకు హామీ ఇచ్చిన ప్రకారం పెంచిన పెన్షన్లు అన్నిటిని తక్షణమే విడుదల చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య అన్నారు నల్లగొండ జిల్లా కన్వీనర్ కొమ్ము హరికుమార్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ సదస్సులో ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళకు బీడీ కార్మికులకు చేనేత కార్మికులకు 4000 రూపాయలు పెన్షన్ వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ ఇస్తామన్న పెన్షన్ను తక్షణమే విడుదల చేయాలని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచిన రేవంత్ రెడ్డి ప్రభుత్వము ఇంతవరకు పెన్షన్ ఎప్పుడు ఇస్తారు అనేది స్పష్టత ఇవ్వడం లేదు.. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ని లబెట్టుకోవాలని డిసెంబర్ 9 నుండి ఇస్తానన్న పెంచిన పెన్షన్ ఇవ్వాలని. డిమాండ్ చేశారు. అలాగే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పి ంచాలని. మిగిలిన మూడు లక్షల మందికి పెన్షన్ వెంటనే కొత్త పెన్షన్ మంజూరు చేయాలని. ఆగస్టు 28వ తేదీ వికలాంగుల హక్కుల పోరాట దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో భారీ సమావేశం నిర్వ హించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరామదాసు వెంకట చారి. రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరిక శ్రీనివాసులు. మహిళా అధ్యక్షురాలు చైతన్య రెడ్డి. జిల్లా కో కన్వీనర్ వీరబోయిన సైదులు, రామేశ్వరి, లక్ష్మివాలి, బాలకృష్ణ, బషీర్, సిద్దవలి, చిట్టి రాజుతదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ తోటలను సాగుచేయాలి



నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అయిల్‌పామ్ తోటలను సాగు చేసినట్లయితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామం రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపైన అవగాహనా సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఆయిల్ పామ్ తోటనాటిన నాలుగవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలనుకున్న ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి శశి కుమార్, క్షేత్ర సహాయకులు యానాల సుధాకర్ రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా కలెక్టర్ ద్వారా ప్రశంస పత్రం పొందిన ముత్తయ్యను రైతులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

నవతెలంగాణ-చింతపల్లి



బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని తెలంగాణ గౌడ కల్ల గీత సంఘాల సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు అనంతుల వెంకటయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోల్కొండ ను ఏలిన మొదటి విప్లవ వీరుడు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వారన్నారు. ఇప్పటికైనా బహుజనులు అందరూ ఏకమై రాజ్యాధికారం దిశగా పోరాడాలని వారన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేసి, అందరూ సహాకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంతుల పెద్ద జంగయ్యగౌడ్, అనంతుల మల్లేష్‌గౌడ్, జెల్లా నరసింహగౌడ్, వందుల యాదయ్యగౌడ్, గౌని రవిగౌడ్, బుర్రి యాదయ్యగౌడ్ మాజీ వాడ్ సభ్యులు, ముద్దం శేఖర్‌గౌడ్, అనంతల రాజు గౌడ్, అనంతల శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

మండలంలో ఫీవర్ సర్వే

నవతెలంగాణ-మర్రిగూడ

కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఫివర్ సర్వే నిర్వహించినట్టు వైద్యాధికారి విజయ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.అంగన్వాడీ,ఆశా కార్యకర్తలతో కలిసి మొత్తం 37 టీం లుగా సర్వే నిర్వహించడం జరిగిందని, శుక్రవారం 1850 గృహాలలో సర్వే చేయగా 12 మందికి జ్వరం ఉన్నట్టుగా గుర్తించి,వారికి ఇంటి వద్దనే చికిత్స చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఫీవర్ సర్వే వారం రోజుల పాటు మండలంలోని అన్ని గృహాలలో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

'గ్రామదేవతల ఆరాధన తెలంగాణ సంస్కృతి'

నవతెలంగాణ-కోదాడరూరల్



గ్రామదేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతి అని, పట్టణ ప్రజలు ఆదివారం నిర్వహించనున్న ముత్యాలమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ బాబు అన్నారు. శుక్రవారం ముత్యాలమ్మ పండుగకు ముందు సంప్రదాయంగా అమ్మవారికి సమర్పించే చల్లగుడు నైవేధ్యాన్ని ఆమె భక్తిశ్రద్ధలతో అందజేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రావెళ్ళ కృష్ణారావు, చలిగంటి రామారావుపాల్గొన్నారు.

నేడు సోషల్ మీడియా సోల్జర్స్ సదస్సు

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని కాశీనాథం ఫంక్షన్‌హాల్లో ఉదయం 10 గంటలకు సోషల్ మీడియా సోల్జర్స్ సదస్సు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ కోదాడ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలపర్చడానికి ప్రతిగ్రామ పంచాయతీకి, మున్సిపాలిటీలో ప్రతి వార్డుకి ఒక సోషల్ మీడియా సోల్జర్స్‌ను నియమించనున్నాము అని తెలిపారు. అందరూ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు ఒక్కో గ్రామపంచాయతీకి, మున్సిపాలిటీలో ఒక్కోవార్డుకు ఒక సోషల్ మీడియా సోల్జర్‌ను నియామకం చేస్తూ వారి వివరాలను పిఆర్వో వెంకటరెడ్డికి అందచేయాలి అని తెలిపారు.

వృద్ధురాలికి మన ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-తిరుమలగిరి

మండల పరిధిలోని మా మిడాల గ్రామానికి చెందిన బెట్టెం సోమనరసమ్మ అనే వృద్ధురాలికి కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేక ఒంటరిగా అతికష్టంగా జీవనాన్ని సాగిస్తోంది. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ బెడిద కరుణాకర్ చొరవతో ఆమెకు సరిపడ నిత్యావసర సరుకులను ఇతర వస్తువులను మన ఫౌండేషన్ చైర్మన్ మహేశ్ సహకరంతో శుక్రవారం వృద్ధ మహిళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు తెలంగాణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోరేళ్ల విప్లవ కుమార్, బాసాని స్వామీ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు బట్టలు పంపిణీ

నవతెలంగాణ-మునగాల

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త లకుమారపు వరప్రసాద్ శుక్రవారం వ్యవసాయ కూలీకులు బట్టలు పంపిణీ చేశారు. ప్రసాద్ సతీమణి స్వర్గీయ రత్నమాల ఆరవ మాసికం సందర్భంగా శుక్రవారం అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుమారుడులకు మారపు నాగరాజు దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డబ్బాల తొలగింపు

నవతెలంగాణ-భువనగిరి అర్బన్



భువనగిరి పట్టణకేంద్రంలోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తా వద్ద ఉన్న ఇరిగేషన్ ఆఫీస్ ముందు, రైతుబజార్ ముందు అక్రమంగా అనుమతి లేకుండా రాత్రికి రాత్రి డబ్బాల నిర్మాణం చేసిన వాటిని శుక్రవారం తహసీల్దార్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో డబ్బాలను తొలగించారు. డబ్బాల అక్రమ నిర్మాణంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు, ప్రభుత్వభూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తుండగా అధికారులు రంగంలోకి దిగి డబ్బాలను తొలగించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి, మున్సిపల్‌టౌన్ ప్లానింగ్అధికారి రాణి, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-చిట్యాల

కారు ఢీ కొనడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం పట్టణకేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన రాందాస్ అనే వ్యక్తి టీవీఎస్ బండి నడుపుకుంటూ భువనగిరి రోడ్డు నుండి వస్తూ పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. నార్కట్‌పల్లి నుండి హైదరాబాద్ వైపు కారు టీవీఎస్ బైక్ ని ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నార్కట్ పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కాటమయ్య స్ఫూర్తితో .. వన సంరక్షణ కోసంఉద్యమిద్దాం

- కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగుండ్ల అచ్చాలు,
- జిల్లా అధ్యక్షులు కొండా వెంకన్న

నవతెలంగాణ-చిట్యాల



నాడు నరరూప రాక్షసులను సంహరించి తాటి, ఈత వనాన్ని కాపాడిన కాటమయ్య స్ఫూర్తితో నేడు వన సంరక్షణ కోసం ఉద్యమిస్తామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగుండ్ల అచ్చాలు ,జిల్లా అధ్యక్షులు కొండ వెంకన్న అన్నారు. ఈ నెల 2 న ప్రారంభమైన అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం చిట్యాలలో మేకల లింగయ్య స్మారక భవనములు మామిడి హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వారు మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేసి అమరులైన నాయకులందరినీ యాది చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా యాత్రలు చేస్తున్నామని, ఈ నెల18న సర్వాయి పాపన్న జయంతి నాడు ముగిస్తామన్నారు. భూములకు ధరలు పెరగడంతో యజమానులు తాటి ,ఈత చెట్లను నరికి వేస్తున్నారని దీనివల్ల గీత కార్మికులు ఉపాధి కోల్పోవడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. చెట్లను తొలగించడం చట్ట ప్రకారం నేరమన్నారు. ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలని, 560 జీవో అమలు చేయాలని, ప్రభుత్వ భూమి లేనట్లయితే కొని ఇవ్వాలని కోరారు. ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కప్పల లింగం గౌడ్ మాట్లాడుతూ వృత్తి చేసే వారందరికీ సభ్యత్వము గుర్తింపు కార్డులు ఇవ్వాలని సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ , పాలకూరి వెంకటయ్య ,కొంపెల్లి వెంకన్న ,వడ్డగోని శంకరయ్య, మాధగోని దేవయ్య, పాలెం సత్తయ్య ,పనస యాదయ్య, బొమ్మ గోని శంకరయ్య, వడ్డగోని యాదయ్య, మాధ సత్యనారాయణ ,బత్తుల నరసింహ, కట్టంగూరు శీను ,కొయ్యేడి మీనయ్య ,రాములు ,వడ్డెగాని శంకరయ్య ,భూపతి వెంకన్న, కందుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

నవతెలంగాణ-చింతపల్లి



స్థానిక ఎన్నికలకు సిద్ధమై కమ్యూనిస్టు పార్టీ సత్తా చాటాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో ప్రాజెక్టుల పేరుతో వేలకోట్ల దోపిడీ జరిగిందని విమర్శించారు. వేలకోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. కారణాలేవైనప్పటికీ షరతుల్లేని రుణమాఫీని రైతులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 9మంది మండల పార్టీ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, పల్లపు లక్ష్మయ్య, మల్లోజు శేఖరాచారి, శంషుద్దీన్, నరసింహ, వీరయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, భారతమ్మ, పాప, యాదయ్య, జితేందర్, రామకృష్ణ, సైదులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-చిట్యాల



ఫొటోగ్రాఫర్ల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానని చిట్యాల మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేడు ఫొటోగ్రఫీలో శరవేగంగా మారుతున్న నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని ఫొటోగ్రాఫర్లు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దేవన బోయిన సైదులు, కార్యదర్శి కూరాకుల సుధీర్, కోశాధికారి చొప్పరి లింగస్వామి, కుటుంబ భరోసా ఇంచార్జ్ చిలువేరు కృష్ణ కార్యవర్గ సభ్యులచే జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి ఏలియాస్ , గౌరవ సలహాదారు పున్న రామకృష్ణ, జిల్లా కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాస్,పి వేణుమాధవ్, జిల్లా గౌరవ సలహాదారుల బయన్న, బిముప్పా సుకేందర్ రెడ్డి,ఆవుల ఆనంద్, మండల ఫొటో,వీడియోబి గ్రాఫర్లు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధరణిలో నెలకొన్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న భూమాత పేరుతో సర్వేలు నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి సాగర్ మండలంను ఎంచుకుని సర్వేలు ప్రారంభించారు. రెండు వారాలుగా తిర్మలగిరి సాగర్ మండలంలో జరుగుతున్న సర్వేలో భాగంగా నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని విజయవిహార్ లో శుక్రవారంనాడు జిల్లా కలెక్టర్ మరియు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లతో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ అధికారులు తదితరులున్నారు.



హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

● కాంగ్రెస్ జిల్లా నాయకులు కొంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ-నూతనకల్

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసిన ఘనత దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కే దక్కిందని అని కాంగ్రెస్ జిల్లా నాయకులు కొంపల్లి మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం వలన రైతులు అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. సీఎం వరంగల్ రైతు భరోసా సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని అట్టి హామీని నెరవేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తారని తెలిపారు.

పెద్దచెరువు నిండేదెప్పుడు..?

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని ఉందన్నట్లు ఉంది మండలంలోని లింగగిరి గ్రామ రైతుల పరిస్థితి. గ్రామంలో తలాపున చెరువు ఉండి పచ్చని పంటలతో, చేపల వేటతో నిత్యం కళకళలాడే గ్రామం ప్రస్తుతం చెరువులో నీరు లేక నాట్లు పడక రైతులు, చేపల వేట సాగక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు నాగార్జునసాగర్ పొంగిపొర్లు తుండగా సాగర్ ఆయకట్టు రైతులు ఆనందంతో ఉంటే ఈ గ్రామంలోని రైతులు మాత్రం దిక్కులు చూస్తున్నారు. కారణం ఈ చెరువుకు సాగర్ నీరు నేరుగా వచ్చే మార్గం లేకపోవడమే. ఈ ప్రాంతానికి సాగర్ నీరు రావడం ప్రారంభమై 55 సంవత్సరాలు దాటింది. అయినా ఇన్నేళ్లుగా చెరువులోకి నేరుగా నీటిని తెప్పించుకోవడంతో మాత్రం ఈ గ్రామ రైతాంగం, నాయకత్వం విఫలమైంది. ప్రస్తుతం మన నియోజకవర్గానికి చెందిన భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హయాంలోనైనా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశిద్దాం.



- సాగుకు నోచని 2 వేల ఎకరాలు
- ఆశగా ఎదురు చూస్తున్న రైతులు
- తలాపున సాగర్ కాల్వ పోతున్నా నీరు కరువు
- సాగర్ కాల్వకు తూము ఏర్పాటే పరిష్కారం
- మంత్రి ఉత్తమ్ హయాంలో నైనా పరిష్కారం దొరికేనా?

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

గత యేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలోని లింగగిరి పెద్ద చెరువు, చిన్న చెరువు పూర్తిగా అడుగంటి పోయాయి. మొన్నటి వరకూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా అసలు ఈ ఖరీఫ్‌లో పంటలు పండుతాయా? లేదా క్రాఫ్‌హాలిడే ప్రకటిస్తారా? అనే అనుమానం ఉండేది. కానీ ఇటీవల కృష్ణాబేసిన్‌లో కురిసిన అకాల వర్షాల కారణంగా ఒక్క సారిగా నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో నీరు వచ్చి చేరింది. రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సాగుపై ఆశలు చిరుగురించాయి. వేల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోయింది. కానీ లింగగిరి చెరువుల్లోకి మాత్రం ఇప్పటికీ నీరు చేరలేదు. సాగర్ ఆయకట్టు రైతులంతా వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటే ఈ గ్రామస్తులు మాత్రం ఇంకా చెరువు ఎప్పుడు నిండుద్దా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

చెరువుపైనే ఆధారపడ్డ గ్రామస్తులు

లింగగిరి గ్రామ పెద్ద చెరువు 524 సర్వే నెంబర్‌లో 254 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు కింది భూములే కాకుండా దీని నీటిని ఉపయోగించుకొని లిఫ్టుల ద్వారా కూడా సేద్యం చేస్తున్నారు. చెరువుపై ఆధారపడి మొత్తం 2000 ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండితే గ్రామంలోని పెద్దమొత్తంలో ఉన్న వ్యవసాయ కూలీలకు కూడా చేతినిండా పనిదొరికే అవకాశం ఉంది. కానీ నేడు నీళ్ల లేక పనికోసం పక్క గ్రామాలకు కూలికి వెళుతున్న పరిస్థితి నెలకొంది. దీనితో పాటు చెరువు నిండితే సుమారు 270 మంది మత్స్య కార్మికులకు రోజూ చేపల వేట ద్వారా ఉపాధి దొరికే అవకాశం ఉంది. కానీ వీరికీ పనిలేకుండా పోయింది.

2013 నుండి ప్రారంభమైన ప్రయత్నాలు

ఈ గ్రామ చెరువుకు నేరుగా సాగర్‌నీరు తెచ్చేందుకు ఎలాగైనా మార్గం ఆలోచించాలని భావించిన రైతులు పలుమార్లు చర్చలు జరిపారు. పలువురు ఎన్ఎస్పీ అధికారులను కలిసి సలహాలు సూచనలు తీసుకున్నారు. 2013 నుండి కలెక్టర్‌కు, జిల్లా మంత్రులుగా పనిచేసిన ఉత్తమ్ కుమార్‌రెడ్డికి, జగదీశ్‌రెడ్డికి, ఎన్ఎస్పీ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం ప్రారంభించారు. కానీ నేటికీ పరిష్కారమార్గం చూపలేకపోయారు.

కాలువలు పూడిక, ఆక్రమణ

ఈ సమస్యకు ప్రధాన కారణం ఈ గ్రామ చెరువుకు నేరుగా సాగర్ నీరు వచ్చి చేరే అవకాశం లేకపోవడం. హుజూర్‌నగర్, గోవిందాపురంలో వర్షాలు పడ్డప్పుడు వచ్చే వర్షపు నీరు, అలాగే ఈ ప్రాంత రైతులు నాట్లువేయగా వచ్చే జాలు నీరు చెరువులోకి వచ్చి చేరడం తప్ప నేరుగా సాగర్ నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీనితో పాటు హుజూర్‌నగర్ నుండి కాచవారిగూడెం స్టేజీ వద్ద నుండి వచ్చే మరో సాగర్ కాలువ కూడా నేరుగా చెరువులోకి వచ్చే అవకాశం లేదు. పైన కాచవారిగూడెం, హుజూర్‌నగర్ రైతులు నాట్లు పెట్టాక మాత్రమే నీరు దిగువకు వచ్చే అవకాశం ఉంది. ఈ కాలువలో పూర్తిగా చెట్టు పెరిగి, పూడిక పేరుకుపోయి దిగువకు నీరు రావడం కష్టంగా మారింది. దీని కోసం ఇటీవల గ్రామానికి చెందిన కొందరు రైతులు స్వంత ఖర్చులతో ప్రొక్లెయిన్ సాయంతో కాలువను బాగు చేసినప్పటికీ ఎగువ ప్రాంత రైతులంతా ఒకే సారి నాట్లు ప్రారంభించడంతో దిగువకు నీరు రావడం కష్టంగా మారింది. దీనికి తోడు చెరువలోకి మిగులు నీరు వచ్చే కాలువను కూడా కొందరు ఆక్రమించారు. చెరువును నింపాలని ఇటీవల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కూడా చేశారు.

రామలక్ష్మీపురం వద్ద తూము ఏర్పాటే పరిష్కారం

లింగగిరి గ్రామ చెరువుకు నేరుగా సాగర్ నీరు రావాలంటే ఎన్ఎస్పీ మేజర్ కాలువకు రామలక్ష్మీపురం వద్ద ఉన్న తూము ద్వారా నీటిని విడుదల చేస్తే గోవిందాపురం గ్రామం సమీపంలోని కాలువ ద్వారా నేరుగా చెరువులోకి నీరు వచ్చే అవకాశం ఉందని గ్రామరైతులు అంటున్నారు. ఇన్నేళ్ల ఈ సమస్యకు ప్రస్తుతం భారీ నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ద్వారా నైనా ఓ శాశ్వత పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పాలకులు మారినా సమస్య పరిష్కారం కాలేదు

యలమశెట్టి వీరస్వామి, సీపీఐ(ఎం) నాయకులు



ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులతో కలిసి తమ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వడం, రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడం చేశాము. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ యేడాది కరువు పరిస్థితులను చూసైనా గ్రామస్తులు కలిసిరావాలి. పోరాటాల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని నమ్ముతున్నాం.

దశాబ్దకాలంగా ఎదురుచూపు

ఎస్‌డి అబ్దుల్‌నబి, బీఆర్ఎస్ నాయకులు



చెరువును సాగర్ నీటితో నింపేందుకు ఉన్న అవకాశాలపై దశాబ్ద కాలంగా ఎంతో ప్రయత్నం చేస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము. అధికారుల్లో కొంత కదలిక రావడం, ఈలోగా ప్రభుత్వం మారడంతో తిరిగి యథాతథ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలి.

మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

- ఎంఎ నిజాముద్దీన్, కాంగ్రెస్ నాయకులు



గ్రామంలోని చెరువును సాగర్ నీటితో నింపేందుకు ఉన్న అవకాశాలను రైతులతో చర్చించి, సమస్య పరిష్కారం కోసం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము. ఆయకట్టు రైతుల సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తాను.

బోగారం విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని బోగారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు కాంగ్రెస్ జిల్లా నాయకులు కూనూరుసాయికుమార్‌గౌడ్ వాలీబాల్స్, ఫుట్బాల్స్, సెటిల్ బ్యాట్స్, సెటిల్ నెట్‌బాల్స్, కలర్‌క్యూబ్స్ డిస్క్, త్రోటు కేజీ ది 2 షాట్ పుట్ తదితర క్రీడాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక,క్రీడారంగాలలో కూడా రాణించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోగు సత్తయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ జేల్లా శ్రీనివాస్, అంతటి మల్లేశం,ఎస్ఎంసీ చైర్మెన్ కడారి పాపయ్య,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేడికృష్ణ, కడారి శ్రీనివాస్, చింతల మల్లేశం, కూనూరు స్వామి, గ్రామ యువకులు గోగుసత్యనారాయణ, బద్దులమహేష్, జేల్లా శ్రీనివాస్, బైకానినరేష్, మేడివెంకటేశం,గుంజ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముస్కువెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రవాణా రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



రాష్ట్రంలో వివిధ రవాణా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) నల్గొండ జిల్లా కార్యదర్శి సిహెచ్. లక్ష్మీనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్ లో సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12 లక్షల మంది రవాణా రంగ కార్మికులు పనిచేస్తున్నారని వీరందరి సంక్షేమం కోసం ప్రభుత్వం ఒక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, పెన్షన్, ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన మోటార్ వాహన చట్టం ద్వారా విపరీతమైన ఫైన్స్ వేస్తున్నారని హిట్ అండ్ రన్ తో రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లనే బాధ్యులుగా చేస్తూ పెద్ద నేరాలకు వేసే శిక్షలను ఫైన్స్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోల్ ధరలు స్పేర్ పార్ట్స్ సీట్ టాక్స్ రోడ్ టాక్స్ విపరీతంగా పెంచి రవాణా రంగాన్ని తీవ్ర సంక్షోభం వైపు నడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై రవాణా రంగ కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు కోసం ఈ నెల 20 నుండి సెప్టెంబర్ 15 వరకు సంతకాల సేకరణ, సెప్టెంబర్ 23న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నాగటి జోసెఫ్, పేర్వాల రాములు, నగేష్, జానయ్య, పొడిచేటి లింగస్వామి, జక్కల గణేష్, పి సాయి, ఎండి సద్దాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని ఈ నెల 17 నుండి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎండి. యూసుఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ మునిసిపాలిటీలో ఎల్ఆర్ఎస్ కోసం 14,313 దరఖాస్తులు రాగా వాటిలో4,400 దరఖాస్తుల పరిశీలన సాగుతుందని వాటిలో 1,722 దరఖాస్తులు పరిశీలించి ఆమోదం లభించిందని పేర్కొన్నారు. ఇక వారు మున్సిపాలిటీకి చెల్లించే రుసుము నిర్మాణ పనులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు పెండింగ్ ఉంచ వద్దన్న ఉద్దేశ్యంతో క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాపితంగా చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ఒక రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు నీటిపారుదల శాఖ ఏఈలు, టౌన్ ప్లానింగ్ అధికారులు కలసి దరఖాస్తుదారుడు స్థలాన్ని పరిశీలించి తుది నివేదిక ఇస్తారన్నారు. సమావేశంలో టీపీఎస్ అంజయ్య అన్నారు.

కోదండరాం ఎమ్మెల్సీగా ఎంపిక కావడం పట్ల హర్షం

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ మలిదశ ఉద్యమ నేత,తెలంగాణా జెఏసి చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరాం ఎంఎల్సిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేయడం పట్ల తెలంగాణా జేఏసీ నాయకులు మాలోత్ దశరథ్ నాయక్ లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను మలిదశ ఉద్యమంలో ప్రజల వద్దకు తీసుకోని వెళ్లి తెలంగాణ ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యేలా పాటు పడి రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను కోదండరాం నెరవేర్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారం శ్రీనివాస్,మాడుగుల శ్రీనివాస్, అంజయ్య,జయరాజు,సైదులు,సురేందర్ రెడ్డి, మక్ష నాయక్,తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగల ముఠా అరెస్టు

● నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి

నవతెలంగాణ-నకిరేకల్



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు నల్లగొండ డీఎస్పీ కె. శివరామి రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నకిరేకల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నకిరేకల్ పట్టణానికి చెందిన కోల సైదులు ఈనెల 12న రాత్రి సమయంలో తనను బెదిరించి కొంతమంది వ్యక్తులు తన వద్ద ఉన్న సెల్ ఫోన్, నగదు తీసుకొని పారిపోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగలను వెతుకుతున్నారు. శుక్రవారం పట్టణంలోని బాబస్ సాహెబ్ గూడెం బస్ స్టేజి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సూర్యాపేట నుండి హైదరాబాద్ వైపు నెంబర్ లేని కారు వస్తుండగా అనుమానంతో ఆపి తనిఖీ చేయగా ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఎరుకల కవాదీ దుర్గాప్రసాద్, నాగునూరి రవికుమార్, కవాతి ప్రభాస్, బండా వెంకటేష్ తోపాటు మరో ఇద్దర బాల నేరస్తులను పట్టుబడినట్లు తెలిపారు. వారి నుండి 50 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఒక ఎర్టిగా కారు, ఒక స్క్రూ డ్రైవర్ ను స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీలు పట్టుబడిన నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన నకిరేకల్ సీఐ పి. రాజశేఖర్, ఎస్సై గోపికృష్ణ, ఏఎస్ఐ జి. కృష్ణ చారి, సిబ్బంది వై. వెంకటేశ్వర్లు, వి. సురేష్, కె. జనార్ధన్, బి. మధుకర్లను అభినందించారు.

ఉత్తమ వ్యవసాయ అధికారికి సన్మానం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



వ్యవసాయ రంగంలో మెరుగైన సేవలందించినందుకు గాను నల్లగొండలో జరిగిన భారత స్వతంత్ర 78వ వేడుకల్లో ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రం అందుకున్న స్థానిక వ్యవసాయ అధికారి ఎడవల్లి గిరిప్రసాద్ కు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు సీనియర్ జర్నలిస్టు ఎండి సాదత్‌అలితో కలిసి శుక్రవారం స్థానిక రైతు వేదికలో శాలువాతో ఘనంగా సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉంటూ. సహకారిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ విస్తరణ అధికారులు. ఎండి లియాకత్ అలి, విష్ణువర్ధన్ రెడ్డి, ఝాన్సీ, చర్లపల్లి శిరీష పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-సూర్యాపేట

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాతనే వారికి చికిత్స అందించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి వైద్యఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలలో, పట్టణాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ కేస్ నమోదు అయిన పరిసర ప్రాంతాలలో పైరేత్రం స్ప్రే చేయించాలని అన్నారు. ఎక్కడైనా డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే ర్యాపిడ్ టెస్ట్ చేయాలని అప్పుడు డెంగ్యూ అనిపిస్తే వెంటనే బ్లడ్ శాంపిల్స్ ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కి పంపించాలని అక్కడ డెంగ్యూగా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. ప్రతి రోజు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఉన్న డెంగ్యూ కేస్‌ల వివరాలు తెలుసుకోవాలని డీఎంహెచ్‌ఓకి సూచించారు. డాక్టర్లు, పంచాయతీరాజ్, మున్సిపాల్టీ అధికారులు స్ట్రక్చర్ ఆఫ్ ప్రొసీజర్ (ఎస్ఓపి)ని అమలు పర్చాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఒక్క డెంగ్యు కేస్ నమోదు అయినా ఆ గ్రామం/వార్డులో కానీ ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో, పట్టణాలలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డెంగ్యు కేస్ నమోదు అయితే వెంటనే సంబంధిత మండల ఎంపిడిఓకి, లేదా మున్సిపల్ కమిషనర్లకు తెలపాలని, ర్యాపిడ్ టెస్ట్ కిట్‌ని ప్రతి హాస్పిటల్‌లో ఉండాలని కలెక్టర్ డాక్టర్‌లకి సూచించారు. అంతకు ముందు కమిషనర్, కలెక్టర్‌లు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని సందర్శించారు. హాస్పిటల్‌లోని బ్లడ్ కంపొనెంట్ సపరేట్ మిషన్‌ని, మైక్రో బయలాజీ ల్యాబ్, బయో కేమిస్ట్రి ల్యాబ్‌లను సందర్శించారు. జ్వరంతో వచ్చే చిన్న పిల్లల కొరకు ప్రత్యేక వార్డు ను ఏర్పాటు చేయాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, జడ్పీ సిఈఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలత, హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ గురు రాజ్,సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూయ, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్- 27 లిఫ్ట్‌కు మరమ్మతు చేసి నీటి విడుదల చేయాలి

నవతెలంగాణ-నేరేడుచర్ల

ఎల్ 27 లిఫ్ట్‌కు మరమ్మతు చేసి వెంటనే నీటి విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మేడారం గ్రామంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫోన్ చేసిన వెంటనే ఎల్27 లిఫ్ట్‌లో పని చేసేవారు స్పందించే వారని, నేడు ఇరిగేషన్ మంత్రి ఉండి కూడా పక్కనే సాగర్ కాలువ పోతున్నా సాగుకు నీళ్లుఇవ్వడంలేదని ఆరోపించారు. చెరువులు నింపడం లేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సాకులు చెప్పుకుంటూ గడుపుతున్నారన్నారు. ఈ మధ్యన చాలా సార్లు వెళ్లి అడిగినా, లిఫ్ట్ నడిపేటప్పుడు మూడు రోజులు నడిపి మళ్ళీ రిపేర్ అని చెప్తున్నారని, లిఫ్ట్ కింద పొలాలు, చెరువులు నిండక రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేధన వ్యక్తం చేశారు. రెండ్రోజుల్లో లిఫ్ట్‌ను పునరుద్ధరించకపోతే.. ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

బొల్లం అసత్య ప్రచారాలు మానుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పట్టణంలో ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకటరత్నం బాబు మాట్లాడారు. పట్టణంలో వైన్స్ సిండికేట్ మద్యం సీసాలపై 15 రూపాయలకు అదనంగా అమ్ముతున్నారని ఇందులో ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ఓ టీవీ ఛానల్‌కు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన ఆరోపణల పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. కోదాడలో వైన్స్ సిండికేట్ లేదని బొల్లం మల్లయ్య యాదవ్ తన ఓటమిని జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు రావెళ్ల కృష్ణారావు, పారా వెంకటేశ్వర్లు, వంటి పులి రమా శ్రీనివాస్ మైలారపు శెట్టి భాస్కర్ నేమ్మది దేవామని కాజా మైనుద్దీన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై సర్వే

నవతెలంగాణ-మునగాల



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అధికారులు జ్వరం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వలిగొండ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటిని సర్వే చేసి బాధితుల వివరాలు సేకరించాలని కోరారు. మునగాల గ్రామపంచాయతీ వివిధ వాడలలో డ్రై డే పట్ల ప్రజలకు అ వగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్ దీన్ దయాళ్, పంచాయితీ కార్యదర్శి చంద్ర శేఖర్ ఆశావర్కర్లు జిపి సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆంజనేయులుకు సన్మానం

నవతెలంగాణ-మునగాల

ప్రతి ఉద్యోగి విధుల పట్ల అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని సామాజిక కార్యకర్త జి. సైదులు కోరారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు పొందిన తహశీల్దార్ వలిగొండ ఆంజనేయులును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ ఆర్ఐలు రామారావు అజయ్ స్వప్న ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌లో దాడులను ఆపాలి

● ఐక్య హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వెంటనే ఆపాలని కోరుతూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో ఐక్య హిందూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. సేవ్ బంగ్లాదేశ్ హిందూస్ అంటూ నినాదాలు చేస్తూ నేరేడుచర్ల ప్రధాన చౌరస్తా నుండి పురవీధులలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలత రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాల ధనుంజయ నాయుడు హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు పాల్వాయి రమేష్ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై మహిళలు చిన్నపిల్లలు అని కూడా చూడకుండా పాశవికంగా దాడి చేయడం ఆస్తులను ధ్వంసం చేయడం, నర మేధం సృష్టించడం మానవత్వాన్ని మంట కలిపిన రాక్షసత్వానికి పరాకాష్ట అని అన్నారు. తక్షణమే రక్షణ బాధ్యతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో మెట్టు వేణుగోపాల్ రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, నోముల మల్లేశం, రాచకొండ శేఖర్, కట్టా సత్యనారాయణ రెడ్డి, మాశెట్టి మోహన్, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, తాళ్ల నరేందర్‌రెడ్డి విజయ్, జూలూరు అశోక్, శంకర్ రెడ్డి, నాగయ్య, పరమేశం, గజ్జల లక్ష్మణ్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కూరెళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అద్భుతం

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని కూరెళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు భారతీయ పతాకగొప్పదనాన్ని, స్వర్ణభారతం అనే నాటకాన్ని ప్రదర్శించారు.నాటకంలో జలియన్వా లాబాగ్ సంఘటన గురించి, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్‌ను ఉరితీసిన విధానాన్ని స్వాతంత్ర్య అమరవీరుల వేషధారణతో స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను కనులకు కట్టినట్టుగా చిన్నారులు ప్రదర్శించిన నాటకం అద్భుతమని, విద్యార్థులకు నాటకాన్ని నేర్పించి, చక్కగాప్రదర్శన ఇప్పించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రమేష్‌ను, విద్యార్థులను అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య ఏఎంసీ చైర్మెన్ రాములమ్మ భారతమ్మ, మాజీ చైర్మెన్ గడ్డం అశోక్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మిరి యాల దామోదర్, ఉపాధ్యాయులు సత్తయ్య, శ్రీను, జానయ్య, ఆండాలు పాల్గొన్నారు.



బిక్కి పుల్లయ్య దర్బార్‌లో జడ్జి ఎవరు ?

- అర్ధ శతాబ్దంగా పంచాయితీల పరిష్కారం
- నిస్వార్థ కమ్యూనిస్టుగా గ్రామంలో పార్టీ బలోపేతం
- నేడు సంతాప సభ

నవతెలంగాణ-నూతనకల్

నాటి నైజం సర్కార్ కు వ్యతిరేకంగా దొరల భూస్వాములు, దేశ్ముఖ్ జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి లాంటి దొరలను ఎదిరించిన నికార్సైన కమ్యూనిస్టుగా ప్రజల తరఫున ఉంటూ ప్రజల కోసం గ్రామస్థాయిలో అర్ధ శతాబ్దంగా పార్టీపలోపేతం కోసం కృషి చేసిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు అమరజీవి కామ్రేడ్ బిక్కి పుల్లయ్య మరణం తో చిల్పకుంట్లలో చీకటి కమ్మింది. సుమారు 50 ఏండ్లుగా గ్రామస్థాయిలో కుల, మత రాజకీయాలకతీతంగా కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, భూ సమస్యలను సైతం పుల్లయ్య ఇంటి ముందు అరుగు మీదనే తీర్పు జరిగేది. రాజకీయాలకతీతంగా ఎంత క్లిష్టమైన సమస్య ఉన్నా పరిష్కారం కావాలంటే బిక్కీ పుల్లయ్య ఇంటివద్ద తన దర్బార్‌లోనే సమస్య పరిష్కారమయ్యేదని గ్రామ ప్రజల నమ్మకం. తన ముక్కుసూటితనం నిజాయితీ, నిస్వార్థం ,న్యాయం వైపు నిలబడే వ్యక్తి అని ప్రజల విశ్వాసం. తప్పు చేసిన వ్యక్తిని తప్పుగా చూపిస్తూ తప్పులు సరిచేసుకొని సామరస్యంగా కలిసి పోవాలని నిందితుడికి సర్ది చెప్పి సామరస్యంగా పరిష్కరించే స్వభావం అతనిలో ఉంది. రాజకీయంగా కులాలవారీగా కొంతమంది దుష్టశక్తులు పంచాయితీని పరిష్కరించకుండా ఉధృతం చేస్తున్న సందర్భంలో సైతం తన వద్దకు సమస్య వస్తే ఆ సమస్య పరిష్కరించి తగిన న్యాయం చేసి ఇరువురిని స్నేహపూర్వకంగా కలిసి జీవించాలని మంచిగా చెప్పే జడ్జి స్థానాన్ని గుర్తుచేసే న్యాయమైన తీర్పు అతనిది. ఇటీవల ఆయన మరణించడంతో చిల్పకుంట్ల ప్రజలు తమకున్న సమస్యలు కానీ, పంచాయితీలు కానీ పరిష్కరించే పెద్దమనిషి లేక పుల్లయ్య దర్బారులో జడ్జి ఎవరు ? అతని స్థానాన్ని పోషించి గ్రామంలో శాంతియుత వాతావరణం నడిపే నాయకుడు ఎవరని ప్రశ్నార్థకంగా మిగిలింది.

నిస్వార్థ కమ్యూనిస్టుగా అతని జీవితం, అతనికి 25 ఏండ్ల వయసులోనే సుమారు 1970 సంవత్సరానికి ముందే కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి మల్లు స్వరాజ్యం, మద్దికాయల ఓంకార్‌తో సహచరనిగా పనిచేస్తున్న స్థానికుడైన తొట్ల మాల్సూరుతో ఉన్న అనుబంధంతో పాటు నాటి పోరాటయోధులు బొజ్జ మంగయ్య, మున్న రోశయ్య, కందాల మల్లారెడ్డి, కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, బత్తుల లింగయ్య, పులుసు నరసయ్య, సామ చంద్రయ్య, నాయకులతో కలిసి అనేక పోరాటాలు నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులైన పుల్లయ్య కార్మికుల, కర్షకులకు న్యాయం జరగాలనే స్వభావంతో భూస్వాములకు, దొరలకు,



పెత్తందారులకు, జెన్నారెడ్డి దేశ్ముకులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. నాటి కాలంలో పాలేరుగా బువ్వ జీతం ఉన్న కాలంలో జీతం నేరుగా, ధాన్యం లేదా డబ్బులు రూపంలో తీసుకోవాలని వాళ్లకు చైతన్యం చేశారు. జీతాల రేట్లు, వరి కోత నాటు వేసే రేట్లు సైతం పెంచాలని కూలీలను ఐక్యపరిచి కూలీల రేట్ల పెంపు కోసం అనేక పోరాటాలు చేశారు. కులవృత్తి కార్మికులను సైతం చైతన్యవంతం చేసి చాకలి, మంగలి కిచ్చే కట్టడిని సైతం అనేక రెట్లు పెంచి వాళ్ల జీవన విధానంలో మార్పులను కోరారు. తాను పుట్టిన గీతా కార్మిక కుటుంబంలో గీతా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కామ్రేడ్ మాల్సూర్ చేస్తున్న ఉద్యమంలో భాగస్వాములై గీసే వాడిదే చెట్టు అనే నినాదంతో గీతా కార్మికుల తరపున అనేక సంవత్సరాలు పోరాడి వారికి గుర్తింపు కార్డులను ఇప్పించి ప్రభుత్వం అందించే గీతా కార్మికుల ఆసరా పింఛన్లు సైతం అనేక మందికి ఇప్పిచ్చిన చరిత్ర ఆయనది. ఈ విధంగా అన్ని సామాజిక వర్గ ప్రజల హక్కుల కోసం పోరాడుతూ వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేశారు తాను నమ్మిన జెండాను సుమారు 55 సంవత్సరాలు ఒకటే జెండా మోసాడు. స్వార్థ రాజకీయాల్లో పూటకో పార్టీ రోజుకో జండా పట్టే ఈ రోజుల్లో కూడా తాను నమ్మిన ఎర్రజెండాను ఏనాడు వదలలేదు, బహుజన సామాజిక వర్గ ముద్దుబిడ్డ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ జీవితాన్ని, పోరాట చరిత్రను స్పూర్తిగా తీసుకొని తన చిన్న కొడుకుకు ఓంకార్ పేరు పెట్టుకున్నాడు. అలాంటి కమ్యూనిస్టు నాయకుడిగా ఎంపీటీసీ వచ్చిన నాటినుండి నేటి వరకు చిల్పకుంట్ల గ్రామంలో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఎంపీటీసీ స్థానాన్ని ఓటమి ఎరగ కుండా ఓడిపోకుండా శక్తి సామర్థ్యాలకు మించి పనిచేసి యువతను, విద్యార్థులను, కర్షకులను, కార్మికులను ఐక్యం చేస్తూ పార్టీ గెలుపు కోసం అనునిత్యం కృషి చేసేవారు. గ్రామంలో ఎప్పుడు కేంద్ర రాష్ట్ర అధికార పార్టీలైన కాంగ్రెస్ పార్టీ, నాటి తెలుగుదేశం, నేటి బీఆర్ఎస్, బీజేపీలు మరో ప్రధాన విప్లవ పార్టీలు ఒక్కటైనా సీపీఐ(ఎం)ను ఏనాడు ఓడించలేదు. అది పుల్లయ్య న్యాయకత్వంలో పార్టీ అంతా పటిష్టంగా ఉండేదని ప్రజలు అంటున్నారు.

తన కుటుంబ నేపథ్యం..

పుల్లయ్యకు నలుగురు పిల్లలు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నలుగురిని ఉన్నత చదువులు చదివించారు. ఉన్నత చదువులతోటి జ్ఞానం పెరుగుతుందని ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ప్రజాసేవ చేసే అవకాశం అధికారికంగా ఉంటుందని బాల్యం నుండే తన పిల్లలకు నూరు పోసి అదే దిశగా ఇద్దరి కుమారులను గ్రూప్ 2 స్థాయి ఉద్యోగులుగా తీర్చి దిద్దారు. ఇద్దరు కుమార్తెలను అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడికి పెద్ద కుమార్తెను ఇచ్చి, తన చిన్న కుమార్తెను ప్రముఖ విద్యావేత్త న్యాయవాది వృత్తిని చదివి ప్రస్తుతం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యునిగా పని చేస్తున్న పులుసు సత్యం నకు ఇచ్చి వివాహం చేశారు. ఓపక్క కుటుంబ నేపథ్యం.. మరో పక్క పార్టీ బలోపేతం రెండిటిని సరిచూసుకుంటూ 50 సంవత్సరాలుగా పార్టీని గ్రామాన్ని శాంతియుతంగా నడిపిన చరిత్ర ఆయనది. ఆయన మరణం తీరని లోటని గ్రామస్తులు రోధిస్తున్నారు.

నేడు సంతాప సభ

మండల పరిధిలోని చిల్పకుంట్లలో జరిగే సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కామ్రేడ్ భిక్కి పుల్లయ్య సంతాప సభ ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ శాసనసభ సభ్య జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డితో పాటు అనేకమంది నాయకులు హాజరు కానున్నారు. ఈ సభకు మండల పరిధిలోని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

ఎమ్మెల్యే వీరేశంను సన్మానించిన శేఖర్

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలో సమాచార హక్కు రక్షణ చట్టం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బుటి శేఖర్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ వేముల వీరేశం తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



నవతెలంగాణ-చిట్యాల

శ్రావణమాసం పురస్కరించుకొని రెండవ శుక్రవారం రోజున చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన సతీమణి పుష్పతో కలిసి వ్రతంలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, ఆలయ అధికారి నాగిరెడ్డి, ఆలయ డైరెక్టర్లు, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, రేముడాల లింగస్వామి, పందిరి గీత, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు, ఎన్నారై దుబ్బాక అమరేందర్ రెడ్డి, స్థానిక నాయకులు ఎద్దులపూరి కృష్ణ , ఏళ్ల చంద్రశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

మిర్యాలగూడరూరల్ : శ్రావణమాసం శుక్రవారం నందర్భంగా పట్టణంలోని రైల్వేకాలనీలోగల శ్రీ అష్టలక్ష్మీ మందిరంలో శ్రీవరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాలకు అభిషేకం అనంతరం భక్తులు సామూహికంగా వ్రతాలు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న పందిరి నత్యనారాయణ, జగన్నాధరావు, జానకిరాముడు, రవికిరణ్ విక్రమ్, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మీ, వద్మ, చంద్రకళ కల్యాణి, భవాని, శారద పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని కనకదుర్గ దేవాలయంలో వరలక్ష్మి వ్రతం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నివాసంలో సాంప్రదాయ రీతిలో వేడుకలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు, ఆయా ఆలయాల చైర్మెన్లు ఉన్నారు.

సిద్ధార్థ హోటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బుద్ధావనం వద్ద గల సిద్ధార్థ హెూటల్ ను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి శుక్రవారంనాడు హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందించడం పరిశుభ్రమైన పదార్థాలను సరసమైన ధరలకు ప్రజలకు అందిస్తూ దినదినాభివృద్ధి చెందాలని కోరారు.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి సిద్ధార్థ హెూటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.వీరితో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ అన్నపూర్ణ, వైన్స్ ప్రసాద్,కౌన్సిలర్ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రామ్మోహన్ రావు, సోషల్ మీడియా కన్వీనర్ మద్దాల భాను,నాగరాజు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

అటల్ బిహారీ వాజ్ పాయ్ వర్ధంతి

నవతెలంగాణ-చండూరు

స్థానిక మున్సిపల్ కేంద్రంలో బీజేపీ పార్టీ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్ ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మొర్చ అధికార ప్రతినిధి కోమటి వీరేశం, సముద్రాల వెంకన్న, భూతరాజు శ్రీహరి, చిట్టుప్రోలు వెంకటేశం, కారింగు విజయ్, కార్యదర్శి భూతరాజు వేణు, బూతు అధ్యక్షులు గొల్లురి వెంకన్న, సంగేపు సాయి, గన్నవరం నాగరాజు, నల్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

78వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలను శుక్రవారం ఫెయిత్ బంజారా ఆశ్రమ చిన్నారులు ఘనంగా నిర్వహించారు. ఈ నందర్భంగా సామాజికవేత్త హన్యానాయక్ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను మరువవద్దని అన్నారు. అమరుల త్యాగాలను నేటి యువత స్పూర్తిగా తీసుకోని దేశాభివృద్ధికి పాటువడాలని పిలుపునిచ్చారు. చిన్నారుల మధ్య ఆయన కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు వంపిణి చేసి అన్నదానం చేశారు. అనంతరం చిన్నారులు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెల్మెడి వెంకటేశ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రాజపేట

ప్రముఖ పారిశ్రామికవేత్త చెల్మెడి వెంకటేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజపేట మండలకేంద్రం గాంధీచౌరస్తాలో కేక్ కట్ చేసి వెంకటేశ్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సట్టు తిరుమలేష్, సర్పంచుల ఫోరం రాష్ట్ర నాయకులు గుంటి మధుసూదన్‌రెడ్డి, ఎర్రగోకుల జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ కేసుల పట్ల అనవసర భయాందోళనలు కల్పించవద్దు

- జిల్లా వైద్యాధికారులు నిర్ధారించాకే ప్రకటించాలి
- ఆసుపత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలను ప్రదర్శించాలి
- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రైవేట్ ఆస్పత్రులు డెంగ్యూ కేసుల పట్ల ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు కల్పించవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర కోరారు. శుక్రవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై ఐ ఎం ఏ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చినప్పుడు పరీక్షల అనంతరం నిర్ధారణ కాకుండా ఎట్టి పరిస్థితులలో జ్వరాలను డెంగ్యూగా ప్రకటించవద్దని కోరారు.దీనివల్ల ప్రజలు అనవసరమైన భయాందోళనకు గురవుతారని, అందువల్ల డెంగ్యూ పాజిటివ్ కేసులు వచ్చినచోట తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లేదా డిసిహెచ్ఎస్‌లతో నిర్ధారణ చేసుకున్న తర్వాతే డెంగ్యూ కేసులుగా ప్రకటించాలని చెప్పారు.అదే విధంగా ప్రైవేట్ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులకు బిల్లుల విషయంలో మానవతా దృక్పథంతో చార్జీలు వసూలు చేయాలని అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం డాక్టర్లు ఎవరు వైద్యం చేస్తున్నది అలాగే తీసుకునే ఫీజు, ఆస్పత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, తదితర అన్ని వివరాలు ఆస్పత్రికి వచ్చిన వారికి తెలిసే విధంగా ప్రదర్శించాలన్నారు. అలాగే ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను సైతం అందరికీ కనపడే విధంగా ఏర్పాటు చేయాలని, ప్రతి ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ మెజర్స్ ను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు పెంచాలని, అనవసరంగా సిజేరియన్ వైపు వెళ్ళవద్దని కోరారు. జ్వరం కేసులకు సంబంధించి ప్రతిరోజు నివేదికను పంపించాలని ఆయన ఆదేశించారు. డెంగ్యూ నిర్ధారణ టెస్టు వచ్చిన తర్వాత మాత్రమే డెంగ్యూ కేసులు ప్రకటించాలని పునరుద్ఘాటించారు. ఈ విషయంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, డాక్టర్ పుల్లారావు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుచరిత, డాక్టర్ గౌరీ శ్రీ, అలాగే డాక్టర్ వసంత కుమారి, డాక్టర్ డి. శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.